ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
శుక్రవారం 28 ఆగస్టు 2026 సంపుటి: 1 సంచిక: 71 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ

**పుతిన్‌తో కీలక భేటీ- భారత్, రష్యా సంబంధాలపై చర్చ**

**నాలుగు రోజుల పాటు రెండు దేశాల్లో పర్యటించనున్న ప్రధాని మోదీ- బిష్కెక్‌లో 26వ షాంఘై సహకార సంస్థ సదస్సుకు హాజరు**



2




2

### భార్యపై భర్త ఆధిపత్యం
## చెలాయించడం కుదరదు

**పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు**

**పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం**

**పనిమానిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు**

**కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు**

## 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్

### ఆతిథ్య బిడ్ పై అమిత్ షా సమీక్ష

**అహ్మదాబాద్ వేదికగా పలు అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు ప్లాన్**

**2030 కామన్వెల్త్, 2029 పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌పై కూడా చర్చ**

**భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా మార్చడమే లక్ష్యమన్న అమిత్ షా**

**సన్నాహకాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న హోంమంత్రి**



2

## దేశాభివృద్ధికి యువ శక్తితో పాటు క్రీడాశక్తి అవసరం

**ఖేలో ఇండియా సంవాద్ లో యువ అథ్లెటిక్స్ తో ప్రధాని వర్చువల్ గా సంభాషణ**

**ఐదు నుండి 15 ఏళ్ల లోపు యువతను గుర్తించి వారిలోని టాలెంట్ ను ప్రోత్సహించాలి**

**క్రీడాకారులు అథ్లెటిక్స్ కు ప్రభుత్వం అండగా ఉంటుంది**

**ఒలంపిక్స్ లో భారత్ కు తగిన ప్రాధాన్యత లేక పోవడంపై విచారం: ప్రధాని మోదీ**




2

# ఆశలు ఆవిరి

ఇంటిని చక్కదిద్దే చేతులే.. తమ బతుకును చక్కదిద్దుకోలేకపోతే పరిస్థితి ఎలా ఉంటుంది? ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు.. ఊరూరా తిరుగుతూ ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడం.. ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండటం.. ఇంత చేస్తున్నా ఆశా వర్కర్ల జీవితాల్లో మాత్రం నిశ్చింత కనిపించడం లేదు. పని పెరుగుతోంది.. ఆదాయం మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెల్లింపుల్లో జాప్యం.. భవిష్యత్‌పై స్పష్టత లేకపోవడంతో ఎన్నాళ్లుగానో ఉన్న అసంతృప్తి ఇప్పుడు ఆందోళనగా మారుతోంది.

**హైదరాబాద్ బ్యూరో - సింగిడి**

## పెరిగిన పనిభారం.. పెరగని పారితోషికం

## రూ.9,900తో కుటుంబ పోషణ కష్టమే

**ఏళ్ల సేవకు ఉద్యోగ భద్రత కరవు.. చెల్లింపుల జాప్యంతో ఆర్థిక ఇబ్బందులు..**

**రూ.18 వేల స్థిర వేతనం కోసం పట్టుబాటు**



**పనిభారం పెరిగింది..**

గర్భిణీల పర్యవేక్షణ, వ్యాక్సినేషన్, ఇంటింటి సర్వేలు, ఆరోగ్య వివరాల నమోదు వంటి అనేక విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలోనూ కీలకంగా పనిచేస్తున్నారు. అదనంగా మొబైల్ యాప్‌లలో డేటా నమోదు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

**ఆదాయం మాత్రం అంతే..**

ప్రస్తుతం రూ.9,900 గౌరవ వేతనం అందుతోంది. పెరుగుతున్న నిత్యావసరాల ధరల నేపథ్యంలో ఈ మొత్తం కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదని ఆశా వర్కర్లు అంటున్నారు. అందుకే రూ.18 వేల స్థిర వేతనం ఇవ్వాలని పట్టుబడుతున్నారు.

**భవిష్యత్ భద్రత ఎక్కడ?**

ఏళ్లుగా సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ ప్రయోజనాలు, సామాజిక రక్షణ లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. PF, ESI వంటి ప్రయోజనాలతో పాటు పదవీ విరమణ సమయంలో ఆర్థిక అండ కల్పించాలని కోరుతున్నారు.

**చెల్లింపుల్లో జాప్యం..**

గౌరవ వేతనం ఆలస్యంగా అందడం మరో సమస్యగా మారింది. దీనివల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత ఇబ్బందుల్లోకి నెడుతోందని వాపోతున్నారు. పెండింగ్ మొత్తాలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**సర్కార్ స్పందన ఏంటి?**

వేతన పెంపుతో పాటు ఉద్యోగ భద్రత, చెల్లింపుల సమస్య, ఇతర సేవా ప్రయోజనాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆశా వర్కర్లు కోరుతున్నారు. స్పందన లేకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి క్షేత్రస్థాయిలో అండగా నిలిచే ఆశా వర్కర్ల ఆశలు.. సర్కార్ నిర్ణయంతోనైనా నెరవేరుతాయా? అన్నదే ఇప్పుడు ప్రశ్న.



## గవర్నర్‌కు సిఎం పరామర్శ

**హైదరాబాద్, ఆగస్ట్ 27 (సింగిడి)**

అనారోగ్యంతో హై టెక సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.

## మీరాలం చెరువుకు మహర్దశ

### పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

**ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం**

**పనులను పరిశీలించిన సిఎం రేవంత్**

2



హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దబోతోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు , వినోదాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మిర్ ఆలం చెరువును అకస్మికంగా పరిశీలించారు.

**హైదరాబాద్,ఆగస్ట్27 (సింగిడి)**

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం




### ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

**ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు**

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రులు**

**సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు**

2

### నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన
# 29 మంది గల్లంతు

**నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు**

**ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతు**

**యాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలు**

**బాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు**

**కేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయం**

2

నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.

**–న్యూఢిల్లీ ఆగస్ట్ 27 (సింగిడి)**



### ఈషా ఫౌండేషన్‌లో
## విషాద ఛాయలు

**80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు**

**కన్నీటి పర్యంతం అయిన జగ్గీవాసుదేవ్**

2



### యధావిధిగా లోక్‌సభ
## నియోజకవర్గాలు

**మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి**

**ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు**

**ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ**

**తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్**

2




### జన్‌ధన్ డిపాజిట్లు
## రూ.3.17లక్షల కోట్లు

**59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు**

**వివరాలను వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ**

2

### ఈవీ పథకం కింద
## ఆటో డ్రైవర్లకు సాయం

### 200 కేటాయిస్తూ జివో జారీచేసిన తెలంగాణ



**హైదరాబాద్,ఆగస్ట్27 (సింగిడి):** ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్–2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది.

2

## హన్మకొండలో బీఆర్ఎస్ ధర్నా

**హరీష్ రావు అరెస్ట్‌తో పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు**

బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు.

**వరంగల్,ఆగస్ట్27 (సింగిడి)**



2

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 28 ఆగస్టు 2026



## హన్మకొండలో బీఆర్ఎస్ ధర్నా

అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీష్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

## దేశాభివృద్ధికి యువ శక్తితో పాటు క్రీడాశక్తి అవసరం

**న్యూఢిల్లీ ఆగస్ట్ 27 (సింగిడి):**
దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్లతో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసే సాధనాలని మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిధ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడల్లో ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీయడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్సలో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

## 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్

భారత్‌లో అంతర్జాతీయ క్రీడా సంబరాలకు రంగం సిద్ధమవుతోంది. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా సన్నాహకాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఒలింపిక్స్ బిడ్డింగ్ ప్రక్రియ పురోగతిని, క్రీడల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. ఒలింపిక్స్‌తో పాటు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2029లో జరగనున్న పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌ను కూడా అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశం అనంతరం అమిత్ షా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లను నిర్వహించడం ద్వారా భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా నిలబెట్టడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, క్రీడా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, గుజరాత్ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. అహ్మదాబాద్‌లో క్రీడల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లపై అధికారులు అమిత్ షాకు వివరించారు. ఇటీవల గ్లాస్గోలో 2026 కామన్వెల్త్ గేమ్స్ ముగిసిన తర్వాత, తదుపరి ఆతిథ్య నగరంగా అహ్మదాబాద్ తరపున గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కామన్వెల్త్ గేమ్స్ పతాకాన్ని అందుకున్న విషయం విదితమే.

## ఈవీ పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రిక వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఇవిలుగా మార్చే పక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

**80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు**

**కన్నీటి పర్యంతం అయిని జగ్గీవాసుదేవ్**

**చెన్నై,ఆగస్ట్27 (సింగిడి):**
ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజ్ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటిపర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచుచరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

# ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లో మోదీ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు బిష్కెక్ నగరంలో ఎస్‌సీవో సదస్సుకు మోదీ హాజరవుతారు. చివరి రోజు ఆయన ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఆరో 'వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ వేడుకల్లోనూ ఇతర ఎస్‌సీవో దేశాల నేతలతో కలిసి మోదీ పాల్గొంటారు. కిర్గిజ్‌స్థాన్ పర్యటనకు ముందు 29, 30 తేదీల్లో మోదీ ఉజ్బెకిస్థాన్‌లో పర్యటిస్తారు. పుతిన్‌తో జరిగే భేటీలో భారత్– రష్యా ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య సహకారం, పరస్పర ప్రయోజనాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై నేతలు సమీక్ష నిర్వహించినున్నట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి సీబీ జార్జ్ తెలిపారు. అలాగే ఇతర దేశాల నేతలతోనూ మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఆయా నేతల సమయానుకూలత, అందుబాటును బట్టి సమావేశాల షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.

**ముందుగా ఉజ్బెకిస్థాన్‌కు మోదీ**

కిర్గిజిస్థాన్ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఆగస్టు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళ్లనున్నారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన కాగా, ద్వైపాక్షిక పర్యటనగా రెండోసారి వెళ్లడం. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు నిర్వహించనున్నారు. భారత్–ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు నేతలు చర్చించనున్నారు.

**దాదాపు 100 కోట్ల డాలర్ల వాణిజ్యం, పెట్టుబడులు**

భారత్–ఉజ్బెకిస్థాన్ మధ్య ఆర్థిక సంబంధాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విలువ కలిపి దాదాపు 100 కోట్ల డాలర్లకు చేరినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కీలక ఖనిజాలు, ఔషధాలు, విద్య, సమాచార సాంకేతికత, ఆరోగ్య రంగాల్లో ఇరు దేశాలు సహకరిస్తున్నాయి. ఉజ్బెకిస్థాన్‌లో ప్రస్తుతం 16 వేలకు పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. అక్కడ నాలుగు భారతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు కూడా ఉన్నాయి. ఔషధాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, వినోద పార్కులు, విద్య తదితర రంగాల్లో భారతీయ పెట్టుబడులు ఉన్నాయి.



**'వికసిత్ భారత్-2047'పై చర్చ**

మోదీ, మిర్జియోయెవ్ సమావేశంలో భారత్ ప్రతిపాదిస్తున్న 'వికసిత్ భారత్–2047', ఉజ్బెకిస్థాన్ అభివృద్ధి లక్ష్యం 'ఉజ్బెకిస్థాన్–2030' మధ్య సహకారానికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, ఆరోగ్య రంగం, విద్య, అంతరిక్షం, సాంకేతికత, సంస్కృతి, వ్యాపార సంబంధాలు వంటి కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచుకోవడంపై ఇరు దేశాలు దృష్టి సారించనున్నాయి. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఉజ్బెక్ అధ్యక్షుడు మోదీ గౌరవార్థం ఏర్పాటు చేసే విందులోనూ ప్రధాని పాల్గొంటారు.
ఎస్‌సీఓలో ప్రస్తుతం 10 సభ్య దేశాలు ఉన్నాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. కాలక్రమేణా వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, కనెక్టివిటీ, సాంకేతికత తదితర రంగాలకు కూడా సహకారం విస్తరించింది.

## భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

**బెంగళూరు,ఆగస్ట్27 (సింగిడి):**
వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకు రూ.150 చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్27 (సింగిడి):**
లోకసేభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోకసేభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్టాల వారీగా ఉన్న లోకసేభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్టాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోకసభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్టాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోకసేభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోకసేభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోకసేభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోకసేభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

**న్యూఢిల్లీ,ఆగస్ట్27 (సింగిడి):**
దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్–ఆధార్– మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది.

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**పల్నాడు,ఆగస్ట్27 (సింగిడి):**
పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లకమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతివెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢకోని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాం–రతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు హోంమంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి



## మీరాలం చెరువుకు మహర్దశ

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు , సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన సీఎం, పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 (50.18 శాతం) పైల్స్ పూర్తి కాగా, 62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు , ఐలాండ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా చెరువులోకి ఎలాంటి మురుగు నీరు చేరకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. యువతతో పాటు కుటుంబాలను ఆకట్టుకునేలా మిర్ ఆలం చెరువులో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలను అందుబాటులోకి తేనున్నారు. పర్యావరణ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు , వాకింగ్ ట్రాకలుఏర్పాటు కానున్నాయి. అంతేకాకుండా, చెరువులో ఉన్న ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లు వేసుకునే గ్లాంపింగ్ స్పాట్లుగా , డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు. ఈ నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానికులకు ఉపాధి కల్పిస్తారు. సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. దీనివల్ల జూ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు , కుటుంబ వినోదాన్ని పొందగలుగుతారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మిర్ ఆలం ట్యాంక ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారనుంది.

## నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు.
కర్నూలు–ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్–టైమ్ గవర్నెన్స్ సొసైటీ (RTGS) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.
తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్–టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగఢి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80–100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రభాతవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
28-8-2026

# 22-ఏ రద్దు కోసం జెన్ జీ తరహా ఉద్యమం




- ప్రభుత్వం మెడలు వంచి ప్రజల ఆస్తులను కాపాడుతాం
- ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం
- తప్పు చేశారు రద్దుచేసి పాపాన్ని కడుక్కోండి
- మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

**కూకట్ పల్లి, ఆగస్టు 27 (సింగిడి):** 22-ఏ ను రద్దు చేయకుంటే ఢిల్లీ జెన్ జీ తరహా ప్రత్యక్ష ఉద్యమం చేపడుతామని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 22-ఏ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గం ఎన్‌ఆర్‌ఎస్‌ఏ కాలనీ కమ్యూనిటీ హాల్ లో బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 22-ఏ తీసుకువచ్చి ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధ జాబితాలో పెట్టి ప్రభుత్వమే కబ్జాదారుగా మారిందని విమర్శించారు. ప్రజల ఆస్తులు లాక్కుంటున్న ప్రభుత్వం ప్రభుత్వ భూములను ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని ఎత్తివేస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు 22-ఏ తీసుకువచ్చారని గుర్తు చేశారు. దీని ప్రకారం 2008 కి ముందు ఉన్న చట్టాన్ని అమలు చేస్తూ ప్రజల ఆస్తులను యుఎల్సీ పరిధిలోకి తీసుకురావడం సుప్రీంకోర్టు నియమ నిబంధనలను ఉల్లంఘించినట్లే అవుతుందని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలోని భూములను తాకట్టు పెట్టి 20 వేల కోట్లు అప్పు చేశారని, రేవంత్ రెడ్డి పాలనలో 30 వేల కోట్ల విలువ చేసే భూములను అమ్ముకున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని 59 పాలిటెక్నిక్ కళాశాల భూములు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో భవిష్యత్ తరాలకు బొంద పెట్టుకోవడానికి కూడా స్థలం లేకుండా విక్రయాలు చేపడుతున్నారని దుయ్యబట్టారు. 22-ఏ నిషేధిత జాబితా నుండి 98 శాతం భూములు తీసేశామని, క్షమాపణలు చెబుతున్న రెవెన్యూ శాఖ మంత్రి మొత్తం ఈ చట్టాన్ని ఎందుకు తీసివేయడం లేదని ప్రశ్నించారు. హత్య చేసి సారీ చెప్తే సరిపోతుందా అని ఎద్దేవా చేశారు. దీని ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది ప్రజలు సమస్య ఎదుర్కొంటున్నారని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తప్పులు ఒప్పుకొని ఇంకా అలాగే ఉంచడం వల్ల సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లకు చెందిన బ్రోకర్లు రంగంలోకి దిగారని అన్నారు. నిషేధిత ఆస్తిలోని 30 శాతం తమకు ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని ప్రజలను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలపై బాంబులు వేస్తామన్న పొంగులేటి ప్రజల పైన 22-ఏ బాంబు వేశారని ఎద్దేవా చేశారు. తాను రియల్ ఎస్టేట్ వ్యాపారినని చెప్పిన ముఖ్యమంత్రి ప్రజల ఆస్తులతో రియల్ ఎస్టేట్ చేయడం సరైనది కాదని అన్నారు. హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూములను 50 శాతానికి తెగనమ్మి లక్షలాది మంది ఉపాధిని కొల్లగొడుతుంది అన్నారు. తద్వారా కాంగ్రెస్ పెద్దలు లక్షల కోట్ల కుంభకోణం చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ని పెంచి ప్రజల ఆస్తుల ధరలను పెరిగేటట్లు చేశారన్నారు. కానీ రేవంత్ తుగ్లక్ నిర్ణయాల వల్ల పెట్టుబడులు రావడం లేదన్నారు. ఒకవైపు హైడ్రా, మరోవైపు 22-ఏ వల్ల హైదరాబాద్ ప్రజలకు కంటి నిండా నిద్రపట్టే పరిస్థితి లేదన్నారు. తమ ప్రభుత్వంలో 450 కోట్లు వెచ్చించి కూకట్ పల్లి నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించామని, ఎంపీగా గెలిపించి రాజకీయ పునర్జన్మ కల్పించిన కూకట్ పల్లి ప్రజలకు ముఖ్యమంత్రి 22-ఏ ద్వారా తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ బ్రోకర్లకు ఎవరు ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. భేషరతుగా సెప్టెంబర్ 7వ తేదీలోగా 22 ఏను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు తెలిసిన పార్టీగా అసెంబ్లీని స్తంభింపజేసి, సెక్రటేరియట్ ను ముట్టడించి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ఉద్యమం చేపడుతుందని స్పష్టం చేశారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో 40 నుండి 50 ఎకరాల హౌసింగ్ బోర్డ్ స్థలాలను ప్రజలకు అంకితం చేశామని, వాటన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కలవలేదని తనపై కోపంతో నియోజకవర్గ ప్రజలకు రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గాన్ని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో వచ్చేటట్లుగా విడదీసి ఇబ్బందికర పరిస్థితులను సృష్టించారన్నారు. తనపై కోపం ఉంటే తనను చంపాలని అంతేకానీ ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే లోక్ సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం పని చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, పగడాల బాబురావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండాపూర్ మండలంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పర్యటన



**సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు 27 (సింగిడి):** కొండాపూర్ మండలంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గొల్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు బల్జగూడెం నాగేష్ కుమార్తె ఇటీవల వివాహం చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం మల్లేపల్లి గ్రామంలో రామప్ప తండ్రి ఇటీవల మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే తోగార్పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రవి తండ్రి ఇటీవల మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పి, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ప్రేమానందం, ప్రభాకర్ రెడ్డి, బాల గౌడ్, రామప్ప, మానేయ్య, సతీష్, రవి, బుచ్చయ్య యాదవ్, మామిళ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా త్రిశక్తి దుర్గాభవాని దేవి ప్రతిష్ఠాపన మహోత్సవాలు



**పటాన్చెరు , ఆగస్టు 27 (సింగిడి):** పాశమైలారం శ్రీశ్రీ శ్రీ త్రిశక్తి దుర్గాభవాని దేవి ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ మహోత్సవాల్లో భాగంగా బుధవారం మొదటి రోజు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు కొనసాగనున్న ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తొలిరోజు ఉదయం 8 గంటల నుంచి వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా గురువారం ఆగస్టు 27 ఉదయం 8 గంటల నుండి రెండో రోజు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆవాహిత దేవతా పూజలు, మండప పూజలు, వివిధ హోమ కార్యక్రమాలతో పాటు అమ్మవారి ప్రతిష్ఠాపనకు సంబంధించిన ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఆగస్టు 28న శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మూడో రోజు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణోత్తములు నిర్ణయించిన సుముహూర్తము ఉదయం 8 గంటల 13 నిమిషములకు శ్రీ త్రిశక్తి దుర్గాభవాని దేవి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని ప్రతిష్టాపనకు సంబంధించిన ప్రధాన పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల్లో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## పి.ఆర్.ఏ స్క్వేర్ ఇంటీరియర్స్ సంస్థ ప్రారంభం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి**



**సిద్దిపేట ప్రతినిధి ఆగస్టు 27 (సింగిడి):** సిద్దిపేట పట్టణంలో పి.ఆర్.ఏ స్క్వేర్ ఇంటీరియర్స్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, సంస్థ నిర్వాహకులు కొలుపుల ప్రవీణ్ ని కలిసి నూతనంగా ప్రారంభించిన ఇంటీరియర్స్ సంస్థకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సిద్దిపేటలో నూతన వ్యాపార సంస్థలు ప్రారంభించడం అభినందనీయమని, యువత వ్యాపార రంగంలో రాణిస్తూ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

## మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 27 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రోడా మేస్త్రి నగర్ డివిజన్‌లో మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరు కులమతాలకతీతంగా మతసామరస్యంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు,ముస్లిం మైనార్టీ మత పెద్దలతో పాటు స్థానిక నాయకులు జహంగీర్, సలీం, రషీద్, షాకీర్ తదితరులతో పాటు ముస్లిం యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్ రావును కలిసిన భారతీయ పోస్టల్ ఉద్యోగుల సంఘాల నాయకులు



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 27 (సింగిడి):** భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ మరియు బి జి డి కే ఎస్ యూనియన్ నాయకులు లోక్‌సభ సభ్యులు ఎం. రఘునందన్ రావు ని వారి నివాసంలో కలిసి పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. సంగారెడ్డిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయడానికి చేసిన కృషికి యూనియన్ నాయకులు రఘునందన్ రావు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు వల్ల జిల్లా ప్రజలు పాస్‌పోర్ట్ సంబంధిత సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం తగ్గి, ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అలాగే, తెలంగాణ సర్కిల్‌లో పోస్టల్ డివిజన్ల పునర్వ్యవస్థీకరణతో పాటు వరంగల్ రీజియన్ ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని మరో ముగ్గురు ఎంపీలతో కలిసి ప్రతిపాదన సమర్పించినందుకు కూడా యూనియన్ ప్రతినిధులు గౌరవ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ప్రధానంగా గ్రామీణ్ డాక్ సేవకులను (జీడీస్) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలనే అంశాన్ని గౌరవ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. యూనియన్ ప్రతినిధులు వివరించిన సమస్యలను గౌరవ ఎంపీ శ్రద్ధగా విని, ఈ అంశాన్ని గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి దృష్టికి తప్పకుండా తీసుకువెళ్లి చర్చిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా, సంగారెడ్డి పోస్టల్ డివిజన్ ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను కూడా యూనియన్ నాయకులు గౌరవ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సంగారెడ్డి జిల్లాలోని ముత్తంగి, ఐడిఏ పాశమైలారం, ఐ డి ఏ బొల్లారం, తెల్లాపూర్ మరియు అమీన్‌పూర్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అధిక హెచ్ ఆర్ ఏ మంజూరు చేయాలని వారు కోరారు. సంగారెడ్డిలో పోస్టల్ శాఖకు చెందిన ఖాళీ స్థలంలో పోస్టల్ ఉద్యోగుల కోసం స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించాలని కూడా యూనియన్ ప్రతినిధులు గౌరవ ఎంపీని కోరారు. ఉద్యోగులకు నివాస సౌకర్యం కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, సంగారెడ్డి హెడ్ పోస్టాఫీస్‌ను దేశంలోని మోడల్ పోస్టాఫీసుల్లో ఒకటిగా అభివృద్ధి చేయనున్నట్లు గౌరవ ఎంపీ తెలిపారు. అలాగే కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి శ్రీ పెమ్మసాని చంద్రశేఖర్ గారు త్వరలో సంగారెడ్డి పోస్టాఫీసును సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులు మరియు యూనియన్లు ప్రస్తావించిన సమస్యలను ఓపికగా విని, వాటిని సంబంధిత స్థాయిలో పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినందుకు యూనియన్ నాయకులు ఎంపీ కి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు మరియు ప్రతినిధులు బి. శశిధర్, అధ్యక్షులు, పి. పరమేశ్వర్, డివిజనల్ సెక్రటరీ, రామావత్ సురేష్, డిప్యూటీ సెక్రటరీ, వై. రాజేంద్ర కుమార్, డివిజనల్ సెక్రటరీ, బి జి డి కె ఎస్, రవీందర్, డిప్యూటీ సెక్రటరీ, బి జి డి కె ఎస్, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ ఫోన్ సైబర్ సెక్యూరిటీపై పరిశోధనకు పీహెచ్.డీ



**పటాన్చెరు, ఆగస్టు 27 (సింగిడి):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లోని, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి కోక విజయ్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'స్మార్ట్ ఫోన్లలో ఇన్ స్టాలేషన్ అనంతర సైబర్ దాడులను గుర్తించి, వాటి ప్రభావాన్ని తగ్గించే అనుకూల వ్యవస్థ'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. కిరీట్ ముప్పవరం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, అప్లికేషన్ ఇన్ స్టాలేషన్ తరువాత తలెత్తే కొత్త ముప్పుల నుంచి ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ భద్రతను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తుందని తెలియజేశారు. ఈ పరిశోధన, నకిలీ అప్లికేషన్లు, మ్యాన్-ఇన్-ది-డిస్క్ దాడులు, రీప్యాకేజింగ్, ప్రివిలేజ్ ఎస్కలేషన్, యూఐ స్పూఫింగ్ వంటి ముప్పులను నిజ సమయంలో గుర్తించడానికి, ప్రవర్తనా పర్యవేక్షణ, మెషిన్ లెర్నింగ్, రిస్క్-ఆధారిత ప్రతిస్పందన యంత్రాంగాలను మిళితం చేసే ఒక అనుకూల భద్రతా ఫ్రేమ్ వర్కును అభివృద్ధి చేసిందన్నారు. ప్రతిపాదిత పద్ధతులు నకిలీ-యాప్ గుర్తింపులో 95.83 శాతం ఖచ్చితత్వాన్ని, వీక్షణ దాడి గుర్తింపులో 97.33 శాతం ఖచ్చితత్వాన్ని సాధించగా, డైనమిక్ సెక్యూరిటీ అసెస్ మెంట్ ఫ్రేమ్ వర్క్ 94.7 శాతం గుర్తింపు ఖచ్చితత్వాన్ని నమోదు చేసి, ఇన్ స్టాలేషన్ తరువాత జరిగే విజయవంతమైన దాడులను గణనీయంగా తగ్గించినట్టు వివరించారు. ఈ పరిశోధనను బెంచ్ మార్క్ డేటాసెట్లను ఉపయోగించి ధృవీకరించారని, ఇది కనిష్ట వనరుల వినియోగంతో మెరుగైన దాడి నివారణను ప్రదర్శించి, వనరుల కొరత ఉన్న స్మార్ట్ ఫోన్లలో ఆచరణాత్మక వినియోగానికి దాని సామర్థ్యాన్ని ప్రస్ఫుటీకరిస్తోందన్నారు. డాక్టర్ విజయ్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆంజనేయ నగర్ రెసిడెన్స్ ఎన్నికల్లో జె. మహేందర్ ప్యానల్ ఘనవిజయం

- అభినందించిన వడ్డేపల్లి



**కూకట్‌పల్లి, ఆగస్టు 27 (సింగిడి):** మూసాపేట్ ఆంజనేయ నగర్ రెసిడెన్స్ ఎన్నికల్లో జె. మహేందర్ ప్యానల్ ఘనవిజయం సాధించింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పాలకవర్గ సభ్యులు ఈరోజు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన జె. మహేందర్ ప్యానెల్ సభ్యులందరినీ వడ్డేపల్లి రాజేశ్వర రావు ఘనంగా సన్మానించి, వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయ నగర్ రెసిడెన్స్ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, కాలనీవాసుల సంక్షేమం కోసం నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలోనూ తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సమావేశంలో భాగంగా కాలనీ సభ్యులు భద్రతాపరమైన అంశాలను ప్రస్తావిస్తూ కాలనీలో మరింత పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు కాలనీవాసుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, అవసరమైన ప్రాంతాల్లో నూతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించేందుకు ముందుకు వచ్చారు. అంతేకాకుండా, ఇందుకు కావలసిన ఆర్థిక సహాయాన్ని కూడా వెంటనే వారికి అందజేశారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం కాలనీవాసుల నమ్మకాన్ని ఎల్లవేళలా నిలబెట్టుకుంటూ, అందరి సహకారంతో ఆంజనేయ నగర్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శేఖర్ గుప్తా, జె. మహేందర్ ప్యానల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన స్పీకర్



**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 27 (సింగిడి):** వికారాబాద్ జిల్లా పరిధిలోని మోమిన్ పేట మండలం రాంనాథ్ గుడుపల్లి, మర్పల్లి మండలం తుమ్మలపల్లిలో లబ్దిదారురాలు పద్మామహేష్, జ్యోతి పాండు లకు చెందిన ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం పూర్తికావడంతో ఆయన సాంప్రదాయబద్ధంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, స్థానిక నాయకులతో కలసి స్థానిక ఇళ్ళను ప్రాంభించారు. లబ్దిదారులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా లబ్దిదారులు కూడా స్పీకర్ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటినుండి నేటి వరకు నిరుపేదలకు పక్కా గృహాలను నిర్మింపచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. నాడు స్వర్గీయ ప్రధాని ఆయాంలో బలహీనవర్గాలకు ఇళ్ళ స్థలాలు, పక్కా ఇళ్ళు మంజూరీ చేసి నీడను కల్పించినట్లు ఆయన చెప్పారు. నేడు గ్రామీణ ప్రాతాంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు కొనసాగుతున్న నేపథ్యంలో పట్టణాలల్లో కూడా ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల జోలికెళ్తే బంగారు భవిష్యత్ చిత్తు

- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 27 (సింగిడి):** మత్తు పదార్థాల వినియోగంలో 25 ఏళ్లలోపు దేశ యువతనే అధికంగా ఉండడం ఆందోళన కలిగించే అంశం. మత్తు పదార్థాల వినియోగంపై యువతకు అవగాహన కలిగించేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, హోమ్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "నశా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమం ప్రచార పోస్టర్ ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, యువకులు మత్తు పదార్థాల వినియోగముకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలను వినియోగించడం ద్వారా మానసిక, శారీరక సమస్యలు ఉత్పన్నమై చేజేతులా వారి బంగారు భవిష్యత్తును వారే నాశనం చేసుకున్న వాళ్లు అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ యోగిని బీకె. జ్యోతి బహన్ జి, ఎస్ఆర్ నగర్ ఇంచార్జ్ బీకే. మంజుల, బీకే.నాందేవ్, బీకే.నరేందర్ యువకులు పాల్గొన్నారు.

## వికారాబాద్ మండలం కోతేరపల్లి ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 27 (సింగిడి):** ఏమ్మార్పీఎస్ వికారాబాద్ మండల ఇంచార్జీ చిట్టిగిద్ద కిష్టయ్య మాదిగ ఆధ్వర్యంలో వికారాబాద్ మండలం కొత్రేపల్లి ఏమ్మార్పీఎస్ గ్రామకమీటిని ఎన్నుకోవడం జరిగింది. వికారాబాద్ మండల అధ్యక్షుడు నగరం ప్రవీణ్ కుమార్ మాదిగ, వికారాబాద్ ఎమ్మెస్పీ మండల అధ్యక్షులు యాదగిరి మాదిగ, వికారాబాద్ మండల సలహా దారులు రాంచంద్రయ్య మాదిగ, ఆధ్వర్యంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బక్క నర్సిములు మాదిగ, అధికార ప్రతినిధి శేఖర్ మాదిగ, ఉపాధ్యక్షుడు సుధాకర్ మాదిగ, ఎన్నుకోగా కార్యవర్గ సభ్యులుగా అనిల్ మాదిగ, రాజు మాదిగ, సురేష్ మాదిగ, నాగరాజు మాదిగ, లోకేష్ మాదిగ, ప్రవీణ్ మాదిగ శ్రీనివాస్, మాదిగ అనిల్, కుమార్ మాదిగ, యాదయ్య మాదిగ, శ్రీనివాస్ మాదిగ, సలహా దారులుగా రాంచంద్రయ్య మాదిగ, పి రాంచంద్రయ్య మాదిగ, నగేష్ మాదిగ లు వ్యవహరించనున్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
28-8-2026

# ఎడిటోరియల్

Editorial

## అన్ని భాషలకు పునాది సంస్కృతం

(28 ఆగస్టు "ప్రపంచ సంస్కృత భాష దినోత్సవం" సందర్భంగా)

ఇండో-యూరోపియన్ మాండలికాల నుండి ఆవిర్భవించిన అతి పురాతన సంస్కృత భాష హిందూ సమాజ ఆదరణ, ఆధ్యాత్మిక భావనలకు ప్రతిరూపంగా కొనసాగుతున్నది. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలకు నెలవుగా సంస్కృతం పేరు గాంచింది. భారతీయ నాగరితతో విడదీయరానిబంధాలను పెనవేసుకున్న సంస్కృత భాష ప్రాధాన్యాన్ని, ప్రయోజనాలను, పునరుజ్జీవన ప్రయత్నాలను, రేపటి తరానికి భాష రుచిని పరిచయం చేయడం, భాషా సౌందర్యాలను అవగాహన పర్చడానికి ప్రతి ఏట శ్రావణ మాస పూర్ణిమ పుణ్య గడియల్లో, అనగా 28 ఆగస్టు 2026న "విశ్వ సంస్కృత దివస్" లేదా "ప్రపంచ సంస్కృత దినోత్సవం" పాటించడం 1969 నుంచి ఆనవాయితీగా మారింది. భారత్‌లో రక్షాబంధన్ లేదా రాఖీ పౌర్ణమి రోజున ప్రపంచ సంస్కృత దినం జరుపుకోవడం పరిపాటి అయ్యింది. ప్రముఖ సంస్కృత పండితుడు, వ్యాకరణకర్త అయిన పాణిని జన్మదినం సందర్భంగా ప్రపంచ సంస్కృతి దినం పాటింటించడం ముదావహం.

**అన్ని భాషల తల్లి లేదా దేవతల భాష:**

అత్యంత పురాతనమైన సంస్కృత భాషకు ప్రత్యేక లిపి ఇతర భాషల నుంచి ఉద్భవించింది. పాణిని, కాళిదాస్, పతంజలి, వేదవ్యాసుడు, ఆదిశంకరాచార్యుడు లాంటి ప్రముఖులు సంస్కృత భాషకు పట్టం కట్టిన వ్యక్తులుగా నిలిచి పోయారు. బ్ముషలను సంస్కృత సాహిత్య మూల వనరులుగా భావిస్తాం. అందువల్లనే శ్రావణి పూర్ణిమ లేదా రాఖీ పూర్ణిమను బుల్షిట్ పర్వంగానే కాకుండా ప్రపంచ సంస్కృత దినం పాటిస్తున్నాం. అన్ని భారతీయ భాషలకు తల్లి అయిన సంస్కృతాన్ని "అన్ని భాషల తల్లి" అని మాత్రమే కాకుండా "దేవతల భాష"గా కూడా పిలుస్తున్నాం. దాదాపు 3500 ఏండ్ల క్రితం భారతంలో పుట్టిన సంస్కృతాన్ని దేవతల భాషగా పిలుస్తాం. సంస్కృత భాషను కంప్యూటర్ సైన్స్, తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత, గణితం, మత సంప్రదాయాలు, సాహిత్యం, సైన్స్, కళల అభివృద్ధికి ఉపగించడం సంతోషదాయకం.

**బహుళ ప్రచారం పొందిన సంస్కృత నినాదాలు:**

సంస్కృత భాష నుంచి ప్రఖ్యాత నినాదాలు పుట్టడం, ప్రజాదరణ పొందడం జరిగింది. "సర్వే భవంతు సుఖినః (అందరూ సంతోషంగా ఉండాలి)", "విద్యా దదాతి వినయం (జ్ఞానం వినయాన్ని ఇస్తుంది", "సత్యం వద్ద ధర్మం చర (నిజం మాట్లాడండి ; ధర్మాన్ని పాటించడం)", లోకః సమస్తాః సుఖినో భవంతు (అని లోకాల జీవులు సంతోషంగా ఉండాలి)" లాంటివి బహుళ ప్రచారం, ప్రభావాలను కలిగి ఉంటూ, సామాన్య జనాల నాలుకల్లో నానుతూ ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధః డిజిటల్ భాషాశాస్త్రంలో సంస్కృతం పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచ సంస్కృత దినం రోజున విద్యాలయాల్లో సంస్కృత శ్లోకాల పఠనం, వ్యాస రచన, ఉపన్యాస, పేయింటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించవచ్చు. అదే విధంగా సెమినార్లు, వెబినార్లు, కార్యశాలలు, ప్రవచనాలు లాంటి కార్యక్రమాలను కూడా నిర్వహించవచ్చు. విద్యార్థులు, యువత, భాషావేత్తలు, ఉపాధ్యాయులు, భాషా సంఘాలు చేయి చేయి కలిపి సంస్కృత పునవైభవానికి కృషి చేస్తూ, మన భాషా తల్లిని ప్రపంచ మానవాళికి రుచి చూపే ముమ్మర ప్రయత్నాలు చేద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రాఖీ ప్రాశస్త్యం

హయగ్రీవ జయంతి"గా జంధ్యాల,",''రాఖీ", "నార్లీ" పూర్ణిమగా పేరెన్నిక గన్న శ్రావణ పౌర్ణమి సర్వజనులకు పర్వదినం. ఉపవాసాలకు ఉద్దిష్టమైన పండుగ కాక, హిందువులలో అన్ని తరగతుల వారూ నిర్వహించుకునే పర్వం ఇది. వర్షాకాలపు రాకకు సంతసిస్తూ, మధుర పదార్థాలు భుజించడం అనుసరణీయమైన ఆచారం.



వరుణ దేవుని కరుణకోసం కొబ్బరి కాయలు సమర్పించడం చేత 'నార్లీ' లేదా 'నారికేళ పూర్ణమి అని మరో పేరుంది. దక్షిణ భారతా వనిలో శ్రావణ పూర్ణిమ 'పౌతి పౌర్ణమి అంటారు. ఆ రోజున విష్ణు, శివ, గణేశులను పూజిస్తారు. ముంబాయి ప్రాంతంలో నార్లీ పూర్ణిమ అనబడే ఈ దినం నాడు వరుణుని కరుణ కోసం సముద్రుని పూజించే ఆచారం ఉంది. ఆ రోజులలో సముద్రం ప్రశాంతంగా ఉంటుందని నమ్మకం. కనుక పూర్వకాలంలో సముద్రాంతర వర్తకానికి ఈ రోజునే ప్రారంభించే వారు. తిరిగి రావడానికి ఈరోజు ఎంచుకునే వారు. యజ్ఞోపవీతాలు, నారికేళం శ్రావణ పూర్ణిమ నాడే సముద్రంలో పడవేసేవారు. పూర్వ కాలంలో శ్రావణ పూర్ణిమ నాడు ఉపాకర్మానంతరం వేదవిద్య ప్రారంభించడం జరిగేది. ఉపా కర్మ పండుగకాక అధ్యయయానికి సంబంధించిన కర్మ. ఉప నయనమనగా అదనపు కన్ను. గురువు తన ప్రజా ప్రాభవం చేత వటువునకు జ్ఞాన నేత్రమును తెరిపించడమన్నది పరమార్థం. యజ్ఞం, ఉపవీతంతో కలిస్తే యజ్ఞోపవీతం. ఉప వీతమంటే దారము. యాగకర్మచేత పునీతమై మూడు పోచల దారం. సృష్టి స్థితి, లయకారులైన త్రిమూర్తులను సూచించేవి ఒక్కో ముడిలోని మూడు తాళ్ళు. జంధ్యాల పౌర్ణమి నాడు చేయు కర్మనే ఉపాకర్మ. మాతా పితరుల వల్ల ఏర్పడేది ప్రథమ జన్మకాగా, మౌంజీ బంధనం వల్ల ఏర్పడునది ద్వితీయ జన్మ అయినందుకే ద్విజులు" పేరు. శ్రావణి పర్వాన్ని ద్విజులు వేద శాఖలకు చెందిన రుషుల అనుగ్రహానికై రుషి పూజ, రుషి తర్పణాలు చేస్తారు. శతపథ బ్రాహ్మణ ప్రకారం "గౌతమ, భరద్వాజ, విశ్వా మిత్ర, జమదగ్ని, వశిష్ఠ, కశ్యప, అత్రి"ని సప్త ఋషులు అంటారు. అయితే "మరీచి, అత్రి, అంగీ రస, పులహ, క్రతు, పులస్త్య, వసిష్ఠులను" సప్త రుషులుగా మహాభారతం చెపుతున్నది. వేదకాండర్షుల అనుగ్రహం ఉపాకర్మానుష్టానం చేయడం వల్ల కలుగుతుంది. సంవత్సర పాప నాశనానికి విరజాహోమం చేస్తారు. "శ్రౌత స్మార్త నిత్య నైమిత్తిక కామ్య కర్మానుష్టాన యోగ్యతా సిద్ధ్యత్తం యజ్ఞోపవీత దారణం" నిర్దేశితమైనది. వేదశాస్త్ర పురాణేతిహాసాది సమస్త వాఙ్మయార్థం పితృ తర్మణం, బ్రహ్మయజ్ఞం చేస్తారు. ఉపాకర్మకు యజుర్వేదులకు పూర్ణిమ తిథి, రుగ్వేదులకు శ్రవణ నక్షత్రం, సామవేదులకు హస్తా నక్షత్రం ప్రధా నాలు. శ్రావణంలో ఉపాకర్మ కారణాంతరాలవల్ల చేయలేకపోతే ఆషాఢ లేదా భాద్రపద పౌర్ణమి నాడు చేస్తారు.

**రాఖీ పౌర్ణమి ప్రాశస్త్యం**

సర్వరోగ ఉపశమనం, సర్వాశుభ వినాశనం కోసం ధర్మజుడు శ్రీకృష్ణుడిని ఉపాయం అడుగగా, రక్షాబంధన విధి ఉపదేశించినట్లు, దేవాసుర యుద్ధంలో ఇంద్రుని, ఇంద్రాణి రక్షాబంధనం చేసి, విజయం సాధింప చేసినట్లు శ్రీకృష్ణుడు వివరించిన సందర్భం పురాణ కథనం. రక్షాబంధనం భార్య, భర్తకు కట్టాలని ఉన్నా, ఆచరణలో సోదరియో, కూతురో కట్టే ఆచారాన్ని వ్రతోత్సవ చంద్రిక వివరిస్తున్నది. శ్రావణ పూర్ణిమ రాఖీ పూర్ణిమ. రాఖీ అంటే తోరము, తోరం పట్టు దారంతో లేదా నూలుదారంతో చేయబడుతుంది. రాఖీ అనేది ఒక ఆభరణం లాంటిది. రంగుదారంతో లేదా కాగితంతో చేసి, దానికి తోరం జోడించి, దానిని సోదరి సోదరుని ముంజేతికి కట్టడం సాంప్రదాయం. బొట్టుపెట్టి హారతినివ్వడం, సోదరుడు, సోదరికి కట్నకాను కలు సమర్పించడం ఆచారం. రాఖీ ప్రాధాన్యతను బట్టి ఒక స్త్రీ, పురుషునికి రాఖీ పంపి లేదా కట్టి ఆతని రక్ష కోరే ఆచారం ఏర్పడింది. దానిని అందుకోవడంతోనే ఆతడు ఆమెకు సోదరుడైరక్షకుడవుతాడని భావన.

– రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండి పెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

# సుట్టమొత్తే లేదు.. ఛాయ్..!..
## ధరలతో సామాన్యుడి 'యుద్ధం'

ఓయ్..నిన్నే.. ఏంటి అప్పటి నుండి పిలిస్తే పలకడం లేదు.. ఏదో పరధ్యానంలో ఉన్నావు. ఏమైంది.. నీకు..రాఖీ పున్నంకు తోలుకపోయేందుకు ఇయ్యాల మా అన్నొస్తున్నడు... చానా రోజులకొస్తున్నడు.. శ్రావణమాసం కదా..చుక్క.. ముక్కనడవవదు.. అన్నం.. పప్పు..చారు.. వంకాయ శాఖంతో పాటు...కంచుడు పెట్టి బజ్జీలు పోయనా.. ఇంకేమైనా...చేయనా.. అంటూ భార్య సీత.. పిలవంగనే..ఆలోచనల్లోంచి ఈ లోకంలోకొచ్చాడు. . రామన్న.. ఆమె మాటలు విని గుండె ఒక్కసారిగా గట్టిగా కొట్టుకున్నట్టయింది....ఆయనకు.

..

ఏంటే..మీ అన్నొస్తున్నడా.. రావద్దని చెప్పు... నేనే మీ ఇంటికాడ దిగబెడతా..అని అనడంతో భార్య సీత ఖంగుతింది.. ఏమైంది.. ఈమనిషికి.. ఇయ్యాల...ఇలా అంటున్నడు...అనుకుని.. మా అన్నొస్తేనే మనకు తక్కువైతుందా.. కనీసం ఛాయ్ నీళ్లకు కూడా నోసుకోడా.. గట్టిగా కేక లేసింది..ఇంతపిసినారో డెట్లయిండేమో.. అనుకుంటూ ఇంట్లకెళ్లింది.. పాపం రామన్నకు భామ్మర్ధి వస్తున్నాడని బాధ కాదు.. వంటింట్లో పక్షం రోజుల నుండి ఆయన చేస్తున్న ధరల యుద్ధమే అందుకు కారణం.. మొన్న ఆయన ఆదిలాబాద్ మార్కెట్ కు సరుకుల కోసం ఎళ్లిండు.... అక్కడ ఆయన ధరలు చూసి తెల్లబోయిండు...జేబులో చూస్తే ఐదు వేలున్నయి.. సరుకుల లిస్టేమో పెద్దగుంది...నెల సరుకుల కోసం చూస్తే పక్షం రోజుల సరుకులు కూడా రాలేదు.. మొన్నటికి మొన్న 45 రూపాయలు ఉన్న కిలో చక్కెర ఇప్పుడు 75 రూపాయలకు చేరింది. ఎప్పుడూ పదికిలోల చక్కెర తీసుకునేటోడు పండుగొస్తున్నా సరిపెట్టుకోవడానికి మూడు కిలోలే.. తీసుకున్నడు. నూనె పీప 2800 చెప్పడంతో ఐదు కిలోల నూనె తీసుకున్నడు. మల్లెంక సూద్దామని.. ఇక సన్నం బియ్యం 5400 నుండి 6800కు చేరింది.. దీంతో సుట్టం ఇంటికొస్తే మర్యాద చేయడానికి సన్నబువ్వ పెడదామంటే . ఒక కట్ట బియ్యం తీసుకెళ్లే పరిస్థితి కూడా లేకపోయింది. దీంతో రేషన్ బియ్యంతోనే సరి పెడదామని మనసుకు సర్దిచెప్పుకున్నాడు. ఉల్లి, వెల్లుల్లి ధరలూ మండిపోతున్నాయి. ఇక బజ్జీల పిండి కొందామన్నా.. తెచ్చిన డబ్బులు సరిపోని పరిస్థితి. దీంతో నెలరోజుల సామాను కొనే రామన్న పక్షం రోజుల సరుకులు కూడా కొనలేకపోయిండు. దుకాణమాయనతో ఎందుకే ఇలా అంటే బయటదేశాల్లో యుద్ధంతో ఈ తంటా అని చెప్పడంతో ఎంట తీసుకొచ్చిన పైసలతో అత్తెసరు సరుకులు తీసుకుని కూరగాయల మార్కెట్కు దారి పట్టిండు.. అక్కడకు వెళ్తే అక్కడా ఆయనకు చుక్కలే కనిపించాయి. బీరకాయ.. కాకరకాయ.. చిక్కుడు కాయ.. వంకాయ. .టమాటా..పచ్చిమిర్చి..ఇలా ఏది కొందామన్న కిలో 80 నుండి 100 రూపాయలు పలుకుతుండడంతో ఆయనకు కూరగాయలు కొనే ఆసక్తి కూడా లేకపోయింది.



ఉత్త పప్పునీళ్లతోనే బతుకు వెళ్లదీద్దామని భావించి ఇంటికొచ్చి ఆలోచనల్లో మునిగిండు.. పనికెళ్లొచ్చినంక రోజుకు రెండు సార్లు ఛాయ్ తాగే అలవాటున్న రామన్న ఇంట్లోకి చక్కెర సరిపడ తేలేదు. ఇవన్నీ భార్యకు తెల్వదు. ఉన్న సామాన్లతో ఎట్టా ఐతుకు ఎల్లదీయాలో తెల్వక మదనపడుతున్న ఆయనకు భామ్మర్ధి వస్తున్నాడంటే మరింత భయం పట్టుకుంది..సుట్టమొత్తే చేతికి నీళ్లిచ్చి.. ఛాయ్ తాగేదాకా బతిమాలే రామన్న ఇప్పుడు ఛాయ్ పొయ్యడానికే జంకాల్సిన పరిస్థితి నెలకొంది.. ఇక వంట చేసి పెడదామన్న భార్య మాటలతో నిత్యావసరాల ధరలతో ఏం వండి పెట్టగలమని మదనపడుతున్నాడే తప్ప ఆయన పిసినారి కాదు..కానీ ఆయన భార్యకు ఎట్టా చెప్పాలో తెలియక మదన పడుతున్నాడు. నిత్యావసరాలకే పైసలు ఎక్కువ ఖర్చు చేస్తే ఇక మిగతా ఖర్చుల పరిస్థితేంటి..సుట్టానికి ఛాయ్ పోయలేని పరిస్థితి తీసుకొచ్చిన ధరలను తిట్టుకోలేక..వాటిని అదుపు చేయలేని ప్రభుత్వాల నిస్సహాయ స్థితిని ప్రశ్నించలేక ఆయనలో ఆయనే దిగులు పడుతున్నాడు.. ఇది ఒక రామన్న పరిస్థితి అనుకుంటే పొరపాటే...బయట దేశంలో యుద్ధమేమో గానీ..ప్రతి సామాన్యుడు ఇప్పుడు వంటింట్లో నిత్యావసరాల ధరలతో యుద్ధం చేస్తున్నాడు.

# "వేదోద్ధరణ అవతారమే హయగ్రీవుడు"

"జ్ఞానానందమయం దేవం, నిర్మలం స్ఫటికాకృతిం, ఆధారం సర్వ విద్యానాం హయగ్రీవ ముపాస్మహే" పురాణేతిహాసాలలో ప్రసిద్ధములైన విష్ణువు అవతారాలలో హయగ్రీవావతారం ఒకటి. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం శ్రీహరి దాల్చిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. సమస్త విద్యలను, జ్ఞానాన్ని పాండిత్యాన్ని అనుగ్రహించే శ్రీ గురుమూర్తి హయగ్రీవ స్వామి. వేదోద్ధరణకై సంభవించిన అవతారమే ఇది. మధుకైటభులు అనే రాక్షసులు వేదాలను దొంగిలిస్తే, విష్ణుమూర్తి హయగ్రీవ అవతారాన్ని ధరించి, ఆ మధుకైటభులను వధించి...వేదాలను రక్షించాడు. హిందూమతంలో, హయగ్రీవ స్వామిని కూడా విష్ణుమూర్తి అవతారముగా భావిస్తారు.



గుర్రపుముఖంతో, నరశరీరంతో, చతుర్భుజుడై శంఖచక్రాలను ధరించి వామాంకంలో లక్ష్మీదేవి సహితంగా ఆవిర్భవించిన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే హయగ్రీవ స్వామి. ఆయనలో సకల దేవతలూ కొలువై ఉన్నారని పురాణాలు పేర్కొంటున్నాయి. సూర్యచంద్రులు కళ్లుగా, దేవతలు ఎముకలుగా, అష్టవసువులు పాదాలుగా, అగ్ని నాలుకగా, సత్యం వాక్కుగా, బ్రహ్మ హృదయంగా... ఇలా ఆయనలోని అణువణువూ దేవతామయమని అంటారు. హయగ్రీవున్ని జ్ఞానమునకు, వివేకమునకు, వాక్కుకు, బుద్ధికి, అన్ని విద్యలకు దేవుడుగా భావిస్తారు. హయగ్రీవ స్వామిని చదువుల యొక్క దేవుడుగా పూజిస్తారు. జ్ఞానం, వాక్కు ఆచారము నాశనం కాకుండా సాగునట్లు అనుగ్రహించిన హయగ్రీవ మూర్తిగా శ్రావణ పూర్ణిమ నాడు మహా విష్ణువును కొలవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. హయగ్రీవుడనగా గుర్రం శిరస్సు, మానవ దేహం కలిగిన స్వామి, నరసింహ స్వరూపం వలే వైకుంఠ నాథుడు హయగ్రీవ ధారియైనారు. 'హయ' అనగా విజ్ఞానం . 'గ్రీవ' అనగా కంఠం. అన్ని విద్యలూ కంఠస్థమై ఉన్న సర్వ విద్యా రూపమే హయగ్రీవ మూర్తి. భాగవతంలో సప్తమ స్కంధంలో హయగ్రీవుడు బ్రహ్మ చేసిన యజ్ఞంలో ఆవిర్భవించినట్లు, స్కంద పురాణంలో దేవతల ప్రార్ధనలతో విష్ణువు అశ్వముఖులై అవతరించినట్లు, పూర్వగాథాలహరి లోనూ హయగ్రీవ వృత్తాంతాలు పేర్కొనబడినాయి. దేవీ భాగవతం ప్రకారం ఒకానొక సమయాన మహావిష్ణువు రాక్షసులతో పదివేల ఏళ్ళు భీకర యుద్ధం చేసి అలసి పోయి, అల్లెత్రాడు గట్టిగా బిగించి ఉన్న ధనుస్సును నేలమీద నిలబెట్టి, దాని కోపుమీద తమ గడ్డాన్ని ఆనించి, నిలబడే నిద్ర పోయారు. విష్ణువును వెదకుతూ వచ్చిన దేవతలు, నిద్ర లేపడానికి భయపడి, బ్రహ్మ దేవుడు ఒక చెద పురుగును సృష్టించి, వింటి నారిని కొరకమని చెబుతారు. పురుగు కొరకడంతో ధనుస్సు విసురుగా తుళ్ళి, వింటికి ఉన్న బాణం కొన విష్ణువు మెడకు తగిలి, ఆయన శిరస్సు తెగి, ఎగిరి పోయింది. దేవతలంతా మహాదేవిని ప్రార్ధించగా, ఆమె ప్రత్యక్షమై సూచించిన విధంగా గుర్రాన్ని వధించి, దాని తలను తెచ్చి దేవశిల్పి యైన త్వష్ట ద్వారా విష్ణువు మొండానికి అతికించారు. బ్రహ్మ ప్రాణం పోయగా, హయగ్రీవులైనారు. సృష్టి ఆరంభంలో అగణిత ఏళ్ళ క్రింద చతుర్ముఖ బ్రహ్మకు కు పరమాత్మ వేదశాస్త్రాలను బోధించారు. మధుకైటభులనే ఇరువురు అసురులు, బ్రహ్మ నుండి వేద విద్యను దొంగిలించి, రసాతలానికి పారి పోయారు. హయగ్రీవ రూపంలోని శక్తితో మాత్రమే తాను మరణించునట్లు, హయగ్రీవుడనే రాక్షసుడు, బ్రహ్మ ద్వారా పొందిన వరం కారణంగా, దేవి కృప వల్ల హయగ్రీవ అవతారులైన విష్ణు అదే పేరుగలిగిన అసుర సంహారం చేయడం జరిగింది. తాను చంద్రమండల వాసియైన హయగ్రీవుడు, మహానంద స్వరూపుడు, ఆయన నాసిక నుండి వేదాలు ఆవిర్భవించాయని పురాణ కథనం. హయగ్రీవ విరాట్ స్వరూపాన సత్యలోకం శిరస్సుగా, భూలోకం నాభిగా, పాతాళం పాదాలుగా, అంతరిక్షం కళ్ళుగా, సూర్యుడు కంటి గుడ్డుగా, చంద్రుడు గుండెగా, దిక్పాల కులు భుజాలుగా, అగ్ని ముఖంగా, సముద్రాలు ఉదరంగా, నదులు నదులు, పర్వతాలు ఎముకలు, మేఘాలు కేశాలుగా, సర్వ దేవతా స్వరూపులైనారు. హయగ్రీవుడు తెల్లని శరీరం కలవాడు. లక్ష్మీదేవిని తొడపై కూర్చోబెట్టుకుని, తెల్లని పద్మాసీనులై ఉంటారు. కుడిచేతిలో చక్రం, పై ఎడమ చేతిలో శంఖం, కింది ఎడమ చేతిలో పుస్తకం, కింది కుడిచేయి చిన్ముద్ర ధరించి ఉంటారు. శ్వేతపద్మం సమస్త ఐశ్వర్యాలకు చిహ్నం. చిన్ముద్ర జ్ఞానానికి, పుస్తకం సకల విద్యలకు, శంఖం సకల సృష్టికి కారణభూతమైన నాదానికి, చక్రం అజ్ఞాన సంహారానికి చిహ్నాలు. హయగ్రీవుని ఉపాసించిన వారికి సకలం కలుగుతాయని విశ్వాసం. ఏ దేవతకైనా నామమే శరీరమని, ఆ నామంలోని అక్షరాలే అవయవాలని శాస్త్రవచనం. అందుకే వైష్ణవులకు ఆధ్యాత్మిక విద్యాభ్యాసం హయగ్రీవ నామోపదేశంతో ప్రారంభించడం సంప్రదాయం. హయగ్రీవ నామాన్ని ఉచ్చరించే వారు శివస్వరూపులుగా, పలికిన వారు విష్ణు స్వరూపులుగా, విన్నవారుబ్రహ్మ స్వరూపులుగా అవుతారని బ్రహ్మ చెప్పడాన్ని బట్టి హయగ్రీవనామ ప్రాధాన్యత స్పష్టం అవుతుంది. భారతావనిలో చాలా చోట్ల హయగ్రీవ ఆలయాలు ఉన్నాయి. హయగ్రీవుని విశాల ఆలయం అస్సాంలో ఉంది. తిరుమల శ్రీహరి ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో శ్రీ లక్ష్మీహయగ్రీవ ఆలయం ఉంది. ప్రతినిత్యం చదువుకునే ఈ లలితా సహస్రనామాలు కూడా హయగ్రీవుని ద్వారానే వచ్చాయి. హయగ్రీవుడు చదువులకు అధిదైవం. మన శాస్త్రాలు అంటే ఎంతో కాలంగా ఆచరించి పొందిన అనుభవాల సారాలు. అందుకే "ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః" చాలా కాలంగా చేసిన ఆచారములే ధర్మములు, అవి మనల్ని రక్షించేవి కనుక వాటిని చెప్పేవి శాస్త్రాలు అయ్యాయి. శాస్త్రాలను బట్టి ఆచారాలు సంప్రదాయాలు ఏర్పడ్డాయి. జ్ఞానం, విద్య, సద్య స్ఫురణ, సృజనాత్మకత కావాలనుకునే వారు హయగ్రీవుని ఆరాధించాలి. హయగ్రీవ జయంతిని శుభప్రదంగా భావించి, అక్షరాభ్యాసం కూడా చేసుకుంటారు.

– రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండి పెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 28-8-2026

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

- గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది
- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్



**జమ్మికుంట, ఆగస్టు 27 (సింగిడి):** గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రజా దనం దుర్వినియోగమైందని ప్రజల సొమ్ముతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అసంపూర్ణంగా నిర్మించి వాటిని గాలికి వదిలేశారని జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ మహిళా అధ్యక్షురాలు రేణుక శివకుమార్ గౌడ్ అన్నారు. గురువారం జమ్మికుంట మున్సిపాలిటీ లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ల ఇండ్లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం కేశపురం డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు సందర్శించడం జరిగిందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన స్థితిగతుల గురించి ప్రజలకు తెలపడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అసంపూర్తిగా వదిలేసిన గత ప్రభుత్వం లోని స్థానిక శాసనసభ్యులు రాజకీయం చేయొద్దంటూ వారే స్పృహ లేని రాజకీయాలు చేసుకుంటూ ప్రజల మన్ననలు పొందాలని ఒక దురుద్దేశంతో మా ప్రభుత్వంపై బురద చల్లే మాటలు మాట్లాడుతున్నారని ఇది సమంజసం కాదని తెలిపారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మీకు చిత్తశుద్ధి పదేళ్ల పాలనలో ఎందుకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంపిణీ చేయలేదని అడిగారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యే ఇదే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పై బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీసిన విషయాన్ని మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు అదే బిఆర్ఎస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీగా ప్రభుత్వ విప్ గా ఉండి కూడా నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా మంజూరు చేయలేని కౌశిక్ రెడ్డి ఇప్పుడు పేద ప్రజలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నాడని వారు మండిపడ్డారు. దొంగ దొంగ అన్న చందంగా ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఉన్నాయని ప్రజల సంక్షేమం కోసం ప్రతినిత్యం పాటుపడుతున్న ప్రభుత్వంపై అనవసరపు ఆరోపణలు చేస్తూ పబ్బం పబ్బం గడుపు కుంటున్నారని మండిపడ్డారు. అభివృద్ధి సంక్షేమాన్ని పక్కన పెట్టి కేవలం నియోజకవర్గం ఇన్చార్జి పై ప్రభుత్వం పై విమర్శలు చేస్తూ మూడు సంవత్సరాలు పూర్తి చేశామని నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయని ఎమ్మెల్యే పై ప్రజలు తిరుగుబాటు చేసే రోజు దగ్గరలో ఉందని వారు మండిపడ్డారు. ఎన్నికల్లో ఇంచార్జ్ ప్రణవ్ గెలువకపోయినప్పటికీ ఎమ్మెల్యేలతో పోటీపడుతూ ఈ నియోజకవర్గ అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బ మల్లన్న చైర్మన్ ముద్దమల్ల రవి టిపిసిసి ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాయిని రవి సీనియర్ కాంగ్రెస్ నాయకులు గూడెపు సారంగపాని జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్య దొడ్డె శ్రీకాంత్ కౌన్సిలర్స్ శ్రీపతి స్వర్ణలత నరేష్ ఒగ్గు రమేష్ మాచర్ల రాజు కుతాడి తిరుపతి ఎగిత అశోక్ యాట్ల అశోక్ పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్. బండి పవన్ పాత ప్రసాద్ యం డి సలీం పోతుల శ్రీనివాస్ సలీమ్ పాషా రమేష్ మారేపల్లి అంజనేయులు అజయ్ అన్వేష్ విన్ను తదితరులు పాల్గొన్నారు

## మానవత్వం చాటుకున్న ఎన్ఆర్ఐ మదన్మోహన్ రెడ్డి



### బాధితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన "చింతల "ఫ్యామిలీ

**జమ్మికుంట, ఆగస్టు 27 (సింగిడి) :** వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన కల్వల రాజకుమార్ పెయింటింగ్ వర్క్ చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. అలా పెయింటింగ్ వర్క్ చేస్తున్న సమయంలో విద్యుత్ ఘాతానికి గురై రాజ్ కుమార్ తన రెండు కాళ్లు ఒక చేయి కోల్పోయి అంగవైకల్యంతో ఇంటివద్ద మంచానికి పరిమితమై జీవిస్తున్నాడు. బాధితుడికి భార్య తిరుమల ఇద్దరు కూతుర్లు కళ్యాణి కావ్య ఉండగా వీరి విషయాన్ని తెలుసుకున్న మామిడాల పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చింతల నిర్మల శ్యాంసుందర్ రెడ్డి దంపతుల కుమారుడు మదన్మోహన్ (ఎన్నారై) ఆ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా చింతల శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ పదివేల ఆర్థిక సహాయంతో పాటు రాజ్ కుమార్ పిల్లలకు ప్రతి సంవత్సరం చదువు నిమిత్తం ఐదువేల రూపాయలను అందిస్తామని ఆ కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. మానవత దృక్పథంతో చింతల మదన్ మోహన్ రెడ్డి ఈ సహాయానికి గ్రామస్తులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు గుండెటి మౌనిక కాంగ్రెస్ నాయకులు గుండేటి కిష్టయ్య తాళ్లపల్లి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి




**అల్వాల్, (సింగిడి):** శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి నిర్వహించిన అభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమానికి మల్కాజ్గిరి శాసన సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని, మల్కాజ్గిరి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, నియోజకవర్గం అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలని స్వామివారిని ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణ అధికారి రవీందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, బద్దం పరశురాం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, చిన్న యాదవ్, చంద్ర మౌళి, ప్రభాకర్ గౌడ్, నర్సింగ్, మల్లేష్ యాదవ్, తదితరులు, ఆలయ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గ్రామసభల్లో పాల్గొనండి

### సురేందర్ ముదిరాజ్ పిలుపు



**వికారాబాద్ ప్రతినిధి, (సింగిడి):** పూడూరు మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులు నేడు నిర్వహించనున్న గ్రామసభల్లో పాల్గొనాలని పూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సర్ ఫేస్ 2 ప్రక్రియలో భాగంగా ఈ నెల 27 న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించనున్నారని అన్నారు. ఈ గ్రామసభల్లో డ్రాఫ్ట్ ఓటర్ లిస్టును ప్రజలకు చదివి వినిపించి, ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాలో పేర్లు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ప్రజలు పరిశీలించి, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు గ్రామసభలకు హాజరై తమ వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామస్థులు సహకరించాలని, ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.

## కీసర డివిజన్లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుక



**కీసర (సింగిడి):** కీసర డివిజన్ పరిధిలోని యాద్గర్పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకలకు కీసర డివిజన్ ఒకటి అధ్యక్షులు రామిడి స్వప్న విజయ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. సొంతింటి కలను నెరవేర్చుకున్న లబ్ధిదారులు బోయిని సరళ దర్శన్ కి మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

## శుభకార కాలనీ సమస్యలపై సమావేశం



**కీసర (సింగిడి):** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్లోని శుభకార కాలనీలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్ కాంగ్రెస్ నాయకులు కౌకుంట్ల జీవన్ రెడ్డి దొడ్డి బాలనర్సింహా శ్రీశైలం గౌడ్ కాలనీ వాసులతో సమావేశమై స్థానిక సమస్యలపై చర్చించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పవన్ ఆల్ కాలనీ జాయింట్ సెక్రటరీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**రెండో వేతన సవరణ సంఘం అమలు, ఆరు డీఏలు విడుదల చేయాలి**

**ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి**



**కరీంనగర్, ఆగస్టు 27(సింగిడి) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మహాధర్నా చేపట్టినట్లు తెలిపారు. రెండో వేతన సవరణ సంఘాన్ని 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు, డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధ రించాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రతి నెల కనీసం రూ. 2 వేల కోట్ల నిధులు విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించే నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమకు రావాల్సిన సొంత డబ్బుల కోసం ఉద్యోగులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, వారి సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని కొనసాగిస్తే ఉద్యోగుల హక్కుల సాధన కోసం భవిష్యత్‌లో మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని టీఎన్జీవోస్, తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ఎడ్ల అరవింద్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి, ఉస్మాన్‌పాషా, ఈశ్వరయ్య, అశోక్‌రావు, ఎం.డి. సలీం, కరుణాకర్‌రెడ్డి, ఎలదాసరి లింగయ్య, ముప్పిడి కిరణ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్‌సింగ్, రాజేష్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన బీజేపీ నాయకుడికి పరామర్శ



**కరీంనగర్, ఆగస్టు27(సింగిడి):** భగత్‌నగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు, సన్నిహితుడు మోతే మహేందర్ అనారోగ్యంతో నగరంలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు గురువారం ఆసుపత్రికి వెళ్లి మహేందర్‌ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సునీల్ రావు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం మహేందర్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా తక్షణ ఆర్థిక సహాయం అందించారు.

## యశోద హాస్పిటల్ లో ప్లాస్టిక్ శస్త్రచికిత్సల ప్రత్యేక కేంద్రం

**అత్యాధునిక సౌందర్య, పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు ఒకేచోట**

**ప్రముఖ ప్లాస్టిక్ శస్త్రచికిత్స నిపుణుడు,డాక్టర్ శశికాంత్ మద్దు**




**కరీంనగర్, ఆగస్టు 27(సింగిడి):** సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో ప్రముఖ ప్లాస్టిక్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ శశికాంత్ మద్దు ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ శస్త్రచికిత్సల అత్యుత్తమ కేంద్రం'ను ప్రారంభించారు. ఈ కేంద్రంలో సౌందర్య, పునర్నిర్మాణ శస్త్రచికిత్సలతో పాటు రైనోప్లాస్టీ, లైపోసక్షన్, చిన్నారుల క్లిష్టమైన పునర్నిర్మాణ శస్త్రచికిత్సలకు ప్రత్యేక సేవలు అందించనున్నారు. అని గురువారం రోజున కరీంనగర్ యశోద సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో డా శశికాంత్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ సౌందర్యంతో పాటు, శ్వాస సంబంధిత సమస్యలను సరిదిద్దేందుకు ప్రాథమిక, పునః, సహజ ఆకృతి పరిరక్షణ, కార్యాచరణ ఆధారిత రైనోప్లాస్టీ సేవలు అందుబాటులో ఉంటాయి. సహజ ఫలితాల కోసం త్రిమితీయ చిత్రీకరణ, ఛాయాచిత్రాలు, అనుకరణ, శస్త్రచికిత్స ప్రణాళిక వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తున్నారు. శరీర ఆకృతిని మెరుగుపరిచేందుకు అధునాతన కొవ్వు తొలగింపు విధానాలతో పాటు కొవ్వు మార్పిడి చికిత్సలు కూడా నిర్వహిస్తామని, పుట్టుక తో వచ్చే చీలిక పెదవి, అంగిలి, చెవి లోపాలు, ముఖ కపాల నిర్మాణ అసాధారణతలు, కాలిన గాయాల వల్ల ఏర్పడిన వైకల్యాలు, రక్తనాళాల నిర్మాణ లోపాలతో బాధపడే చిన్నారులకు ప్రత్యేక పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు అందిస్తారు. చిన్నారుల మత్తు వైద్యం, బాల వైద్యం, మాట చికిత్స, భౌతిక చికిత్స నిపుణులతో కూడిన సమగ్ర బృందం చికిత్స అనంతరం పర్యవేక్షణ అందిస్తుందని,ప్లాస్టిక్ శస్త్రచికిత్స కేవలం రూపాన్ని మార్చడానికే పరిమితం కాదని, అవయవాల పనితీరును మెరుగుపరిచి బాధితుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన సేవలను హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు చేరువ చేయడమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశం లో రాజేందర్, రాజు పాల్గొన్నారు.

## పారమిత వరల్డ్ స్కూల్‌లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

### సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు



**కరీంనగర్, ఆగస్టు27(సింగిడి):** అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్‌లో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రక్షాబంధన్ విశిష్టత, భారతీయ సంస్కృతిలో సోదరసోదరీ బంధం ప్రాధాన్యతను వివరిస్తూ నృత్యాలు, పాటలు, ఉపన్యాసాలతో అలరించారు. అనంతరం విద్యార్థినులు వివిధ తరగతుల విద్యార్థులకు రాఖీలు కట్టి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. శ్రీకర్, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, వి.యు.ఎం. ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం. శ్రీకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ద్వారా చికిత్సకు రూ. 2 లక్షల మంజూరు

**కౌకుంట్ల చంద్రారెడ్డి చేతులు మీదుగా సహాయ నిధి అందజేత**



**కీసర (సింగిడి):** ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్, నాగారం ప్రాంతానికి చెందిన చిర్ర నాగేశ్వర్‌రావుకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. చిర్ర వెంకటేశ్వర్‌రావు కుమారుడు చిర్ర నాగేశ్వర్‌రావు కిడ్నీ సంబంధిత సికేడి వెనోప్లాస్టీ చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నిమ్స్, పంజాగుట్టలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి 24-08-2026 తేదీన లేఖ జారీ అయింది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సిఫారసు మేరకు చికిత్స ఖర్చుల కోసం రూ. 2,00,000/- మంజూరు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. చికిత్సను అందించి, చికిత్స పూర్తయిన అనంతరం బిల్లును సమర్పించాలని నిమ్స్ డైరెక్టర్‌కు సూచించారు. అలాగే సీఎం సహాయ నిధిని నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చికిత్సకు ఆర్థిక సహాయం మంజూరు చేసిన ముఖ్యమంత్రికి, సిఫారసు చేసిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



**జమ్మికుంట, ఆగస్టు 27 (సింగిడి) :** ఇల్లందకుంట మండల పరిధిలోని కనగర్తి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇల్లంతకుంట ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడు గ్రామానికి చెందిన మేకల ప్రభాకర్ (40) తన ద్విచక్ర వాహనం పై వెళ్తూ, కనగర్తి గ్రామ శివారులోకి రాగానే వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్ల అదుపుతప్పి కిందపడి పోయాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు, శరీర భాగాలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఆయనను జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ప్రభాకర్ మృతి చెందాడు. మృతుడి భార్య మేకల రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## స్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ డివిజన్ చర్చిగాగిల్లాపూర్ (214)లో 40.50 లక్షల నిధులతో చేపట్టనున్న స్మశాన వాటిక అభివృద్ధి పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. రూ. 40.50 లక్షలతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనుల ద్వారా స్మశాన వాటికలో అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడనున్నాయన్నారు. ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కల మల్లేష్ యాదవ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొట్ల విజయ్ కుమార్, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చెవిటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, కావలి శశి కుమార్, ఆకుల ప్రేమ్, శ్రీకర్ రెడ్డి, మైనార్టీ నాయకులు నయీమ్, మహేందర్ యాదవ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
28-8-2026

# కొండా మురళి రాయభారం భట్టితో భేటీ ఫలిస్తుందా..!?

- సుస్మితా పటేల్ వ్యాఖ్యలకు తెరపడినట్లేనా...?
- జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఆసక్తినీ రేకిస్తున్న అంశం



**హన్మకొండ,ఆగస్టు 27 (సింగిడి):** మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మితా పటేల్ చేసిన వివాదపద వ్యాఖ్యలకు తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్న నేపద్యంలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ వివాదస్పద వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహానికి గురైంది. ఈ క్రమంలోనే. పరిస్థితిని చక్కదిద్దేందుకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో రాయబార యత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే బుధవారం ప్రజాభవనంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కొండా మురళి భేటీ అయ్యారు. అయితే ఈ సమావేశానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా హాజరుకావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. కొండా సురేఖ, ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలపై అధిష్ఠానంతో పాటు పార్టీ ముఖ్య నేతలు, పలువురు ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ చర్యలకు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ కఠిన నిర్ణయం తీసుకోకుండా ఉండేందుకు, సయోధ్య కుదిర్చే దిశగా భట్టి విక్రమార్క సమక్షంలో రాజగోపాల్ రెడ్డి మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు సమాచారం. రాయబారం ఫలించి వివాదం సర్దుమణుగుతుందో లేక అధిష్ఠానం క్రమశిక్షణా చర్యలకే మొగ్గు చూపుతుందో నన్న సస్పెన్స్ కాంగ్రెస్ శ్రేణుల్లో స్పష్టంగా కనిపిస్తుంది. కొండా దంపతుల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారిన వేళ, కీలక రాజకీయ పరిణామం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కొండా మురళి భేటీకి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవ తీసుకుని ఇరువురి నేతల మధ్య భేటీకి ఏర్పాటు చేయడమే కాకుండా, స్వయంగా చర్చల్లోనూ పాల్గొనడం జరిగింది. పార్టీలో నెలకొన్న తాజా పరిణామాలు, తమపై వస్తున్న ఫిర్యాదులపై వివరణ ఇచ్చేందుకే కొండా మురళి ఈ ప్రయత్నం చేసినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో భట్టి విక్రమార్క చేతుల్లో ఎలాంటి ప్రయోజనం లేదనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. కొండా దంపతుల వ్యవహారశైలి, వివాదాస్పద అంశాలపై పీసీసీ, ఇన్‌ఛార్జ్‌ల ద్వారా ఇప్పటికే పూర్తి స్థాయి నివేదిక కాంగ్రెస్ హైకమాండ్ వద్దకు చేరిన విషయం అందరికీ తెలిసిందే. అయితే క్రమశిక్షణ ఉల్లంఘనలపై అధిష్ఠానమే నేరుగా చర్యలు తీసుకునే స్థాయికి కొండా వ్యవహారం వెళ్లిపోవడంతో రాష్ట్ర స్థాయి నేతలు కేవలం తమ అభిప్రాయాలను మాత్రమే వెల్లడించే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతుంది. హైకమాండ్ తుది నిర్ణయం తీసుకునే ముందు రాష్ట్రంలోని కీలక నేతల అభిప్రాయాలను కోరితే, డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క మాట అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటుందన్న ఒక్క కారణంతోనే కొండా మురళి వ్యూహాత్మకంగా రాజగోపాల్ రెడ్డి ద్వారా భట్టిని కలిసినట్లు తెలుస్తోంది. పార్టీలో బలమైన వాయిస్ ఉన్న భట్టి సానుకూలంగా స్పందిస్తే కొంతైనా ఉపశమనం లభిస్తుందన్నది కొండా వర్గం భావిస్తుంది. కానీ, కొండా దంపతుల దూకుడు స్వభావం, గతంలో వారు వ్యవహరించిన తీరు గురించి బాగా తెలిసిన భట్టి విక్రమార్క ఈ విషయంలో ఎంతవరకు జోక్యం చేసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చే భట్టి, పార్టీ నిబంధనలను కాదని వారిని కాపాడే సాహసం చేస్తారా లేక అంతా హైకమాండ్ ఇష్టానికే వదిలేస్తారా అనే విషయం ఆసక్తికరంగా మారింది. రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ రాయబారం కొండా దంపతులకు మేలు చేస్తుందో లేదో తెలియాలంటే అధిష్ఠానం స్పందించే వరకు వేచి చూడాల్సిందే. కాంగ్రెస్‌ను వీడేది లేదని స్పష్టం చేసిన కొండా మురళి. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యల వివాదంపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివాదం నా బిడ్డది ఆమె వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం. కూతురు వేరు.. రాజకీయం వేరు" అని స్పష్టం చేశారు. తన కుమార్తె వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆమె ప్లాన్ (ఏ )లో మాట్లాడిందని,ప్లాన్ (బీ) లో ఏం మాట్లాడుతుందో తనకు తెలియదని కొండా మురళి వ్యాఖ్యానించారు. అయితే ఈ వివాదం కారణంగా తాను కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. లికాంగ్రెస్ పార్టీని వీడేదిలి . సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై మాకు సంపూర్ణ నమ్మకం, విశ్వాసం ఉందని కొండా మురళి స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం కొండా మురళి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

## యువత భవిష్యత్‌కు భూక్య జంపన్న భరోసా



- శంకరాజుపల్లిలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు శ్రీకారం
- మూడు నెలల పాటు కొనసాగనున్న శిక్షణ

**ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 (సింగిడి):** గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక నైపుణ్యాలను అందించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న సూచన, చొరవతో ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం మూడు నెలల పాటు కొనసాగనుంది. జాడి మౌనిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణలో కంప్యూటర్ ప్రాథమిక అంశాలతో పాటు టైపింగ్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ వినియోగం, ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం, డిజిటల్ సేవలపై యువతకు శిక్షణ అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత యువతకు కంప్యూటర్ విద్యను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక యువత హర్షం వ్యక్తం చేస్తోంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక విద్య అందక అవకాశాలు కోల్పో కూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు భూక్య జంపన్న చేస్తున్న కృషి అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## దివంగత శేషమ్మకు సీఎంతో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు నివాళులు




**హన్మకొండ, ఆగస్టు 27 (సింగిడి):** మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కాసు వెంగళరెడ్డి సతీమణి మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి మాతృమూర్తి, అలాగే వైయస్సార్సీపీ నేత కాసు మహేష్ రెడ్డి నాయనమ్మ కాసు శేషమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హైదరాబాదులోని జేఆర్సీ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని శేషమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సీఎంతో కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ వేడుకలు



**చింతపల్లి, ఆగస్టు 27 (సింగిడి):** మండలంలోని తక్కల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుండ్లపల్లి అనిత నరసింహారెడ్డి కి మంజూరైన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేసి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, గ్రామ సర్పంచ్ మేడపు అంజయ్య, డిసిసి కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జటావత్ హరిలాల్ నాయక్, మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, మాజీ జెడ్పిటిసిలు జంగిటి నరసింహ యాదవ్, మాసని మంజుల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, ప్రశాంతి పుర తండా సర్పంచ్ రాజు,మాజీ సర్పంచులు అంగిరేకుల గోవర్ధన్, కాయితి జితేందర్ రెడ్డి, డి శ్రీనివాస్ యాదవ్, నాయకులు కొప్పోల్ అశోక్ , గుణమోని కొండల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ ఆగస్టు 27 (సింగిడి):** పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తుందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాల గూడ మండలం ఐలాపురం, దామరచర్ల మండలం రాళ్లవాగు తండా గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్చేసి ప్రారంభించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతఇస్తుందన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాలను పరిశీలించి, లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి, వారికి నూతన గృహప్రవేశశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్ నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులుపాల్గొన్నారు.

## మిర్యాలగూడ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా గంజి శ్రీనివాస్

కార్యదర్శి మురళీధర్ కోశాధికారి నాగేందర్ ఏకగ్రీవం




**మిర్యాలగూడ ఆగస్టు 27 (సింగిడి):** మిర్యాలగూడ చేనేత సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక బుధవారం స్థానిక చేనేత సహకార సంఘ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఎండి మహిముద్ అధ్యక్షతన జరిగింది. చేనేత సహకార సంఘం పాలక మండలి 9 మంది కార్యవర్గ సభ్యులు సమావేశమై కార్యవర్గం కోసం రెండు గంటలు పాటు చర్చలు జరిగినప్పటికీ ఏకాభిప్రాయం రాకపోవడంతో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నిక నిర్వహించవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎన్నికల అధికారి మహీముద్ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులు గా ఆయిటి పాముల మురళీధర్, గడ్డం రమణయ్య, గంజి శ్రీనివాస్ లు పోటీ చేశారు. 9 మంది ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో పోలింగ్ నిర్వహించగా మురళీధర్ కు నిల్, గడ్డం రమణయ్యకు 03 ఓట్లు లభించగా గంజి శ్రీనివాస్ కు 06 ఓట్లు లభించాయి. దీంతో గంజి శ్రీనివాస్ అధ్యక్షులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మహిముద్ ప్రకటించారు. ఉపాధ్యక్షుల పదవికి రాపోలు కృష్ణమూర్తి, రాపోలు వెంకటేశ్వర్లు పోటీ చేయగా నిర్వహించిన పోలింగ్ లో రాపోలు కృష్ణమూర్తికి 08 ఓట్లు లభించగా రాపోలు వెంకటేశ్వర్లకు 01 ఓట్లు వచ్చాయి. దీంతో రాపోలు కృష్ణమూర్తి ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కార్యదర్శిగా ఆయిటి పాముల మురళీధర్, కోశాధికారిగా రావిరాల నాగేందర్ లు ఏకగ్రీవం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మహిముద్ ప్రకటించారు. మిగిలిన ఐదుగురు చేనేత సహకార సంఘం కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతారని తెలిపారు. కార్యవర్గ సభ్యులు గడ్డం రమణయ్య, రాపోలు వెంకటేశ్వర్లు, నామని సత్యం , పులిపాటి రామేశ్వరి, గుంటి చంద్రకళ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిలుకూరి బాలకృష్ణ, రైస్ మిల్లర్స్ డైరెక్టర్ గుంటి గోపి, రచ్చ హనుమంతరావు, గుంటి శ్రీనివాస్, గోపి, శ్యాం, వెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి

- ఆంకాలజిస్ట్ సుమంత్‌కుమార్




**సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 27 (సింగిడి):** క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తించాలని యశోద ఆసుపత్రి ఆంకాలజిస్ట్ వైద్యులు సుమంత్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఆర్ బంకేట్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శరీరంలోని ఏదైనా ఒక అవయవ భాగంలో కణజాలం అపరిమితంగా నియంత్రణ లేకుండా పెరగడం ఇతర కణజాలలో వ్యాపించి గడ్డలు లేదా పుండ్లు ఏర్పడడానికి క్యాన్సర్ అంటామనీ అటువంటి ప్రాణాంతక వ్యాధిపట్ల ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బయటి పదార్థాల తో క్యాన్సర్ వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉన్నదని మసాలా పౌడర్లు ప్యాకెట్ పౌడర్లు ను వంటలలో వినియోగించడం వలన క్యాన్సర్ కు దారితీస్తున్నదని అన్నారు. కుళ్ళిన పదార్థాలను నిల్వ చేసి మరుసటి రోజు ఉపయోగించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని సాధ్యమైనంత వరకు ఇంటిలోనే కావలసిన పదార్థాలను తయారు చేసుకోవడం మంచిదని అన్నారు. శరీరంలో జ్వరం జలుబు లాంటి ఇతర సమస్యలు 15 రోజులైనా తగ్గకుండా ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని కోరారు. క్యాన్సర్ సోకిన వారిలో జ్వరం రావడం బరువు తగ్గడం వాంతులు విరేచనాల లక్షణాలు కనిపిస్తాయని ముఖ్యంగా ఆడవాళ్లు రొమ్ము క్యాన్సర్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏదైనా చిన్న గడ్డ అయినప్పుడు అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని అన్నారు. 9 సంవత్సరాల నుండి 14 సంవత్సరాలు బాల బాలికలకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తల్లిదండ్రులు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. మలక్ పేట యశోద ఆసుపత్రి లో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా అడ్వాన్స్ ట్రీట్మెంట్ హైపర్ సైట్ క్యాన్సర్ గడ్డకు అడ్వాన్సు మిషన్ ద్వారా చికిత్సను చేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆహారపు నియమాల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. క్యాన్సర్ ముదిరిన తర్వాత బయట పడుతుండడంతో అటువంటి రోగులను కాపాడటం కష్టతరమని అటువంటి మహమ్మారి క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే సరైన శస్త్ర చికిత్స ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తగు జాగ్రత్తలు తీసుకోవడం మన చేతుల్లో ఉందని పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణానికి నెలలో రెండవ నాలుగవ బుధవారం సూర్యాపేట పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు.

# మత్తు మాఫియాపై పోలీసుల నజర్.. నలుగురు అరెస్ట్

- నలుగురు గంజాయి నిందితుల రిమాండ్



**కోదాడ, ఆగస్టు 27 (సింగిడి):** యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండాలని కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బోడిగుట్ట వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరితో పాటు కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టి నలుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1.100 కిలోల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. కోదాడ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు నేరాలకు దారితీస్తుందని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిసై నల్గొండ ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసులో పదో తరగతి విద్యార్థులు ప్రధాన నిందితులుగా ఉన్న ఘటనలు పునరావృతం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

# మృత్యు మలుపుగా దుర్గాపురం స్టేజ్!

**కోదాడ, ఆగస్టు 27 (సింగిడి):** హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై దొరకుంట సమీపంలోని దుర్గాపురం స్టేజ్ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. బస్సు--కంటైనర్ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, గతంలో ఇదే ప్రాంతంలో లారీ--కారు ఢీకొన్న ఘటనలో ఆలమూరు ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ స్వామి మృతి చెందారు. 2024లో జరిగిన మరో ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఇదే ప్రాంతంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదకర బ్లాక్‌స్పాట్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



## మృతుల్లో ఐదుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

కోదాడ మండలం దొరకుంట వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, వారి వివరాలను పోలీసులు గుర్తించారు. మృతులంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. చెన్నకేశవులు నాగేంద్రబాబు, యాసారపు చిన్ని, బేలిపోగు మేరీ కృష్ణ, కొండూరు భావన వర్ష, సురవరపు షకీనా, పిడికిటి లక్ష్మీ తేజగా గుర్తించారు. మృతుల్లో ఐదుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కాగా, యాసారపు చిన్ని టైలర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఉద్యోగాల నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న వీరు వివిధ కారణాలతో స్వస్థలాలకు వెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ఆరుగురి మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



## 35 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత : ఇద్దరు అరెస్ట్



**భూపాలపల్లి, ఆగస్టు 27 (సింగిడి):** భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ సమీపంలోని జాతీయ రహదారిపై అక్రమంగా రవాణా చేస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం అక్రమ తరలింపునకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కలెక్టరేట్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన టాటా ఏసి పికప్ ట్రాలీ ని తనిఖీ చేయగా, అందులో అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం బయటపడ్డాయి. దీంతో రవాణాకు ఉపయోగిస్తున్న వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారు పావనపు రాజు (26) తండ్రి సమ్మయ్య, వ్యాపారి, సీఆర్ నగర్, భూపాలపల్లి. నీలుగొండ రమేష్ (21)తండ్రి తిరుపతి, డ్రైవర్, సీఆర్ నగర్, భూపాలపల్లి. నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ కి అప్పగించినట్లు సీసీఎస్ పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, విక్రయించినా లేదా రవాణా చేసినా చట్టపరమైన తీవ్ర పర్యవసానాలు ఉంటాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్ర తాగునీరు




**మిర్యాలగూడ, ఆగస్టు 27 (సింగిడి):** మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ట్యాంక్ అపరిశుభ్రంగా ఉండటంపై అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య (ఏఐఎఫ్‌డీఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం ఏఐఎఫ్‌డీఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోతుగంటి కాశి ఆధ్వర్యంలో బస్టాండ్‌ను పరిశీలించారు. మాట్లాడుతూవాటర్ ట్యాంక్ పైభాగం సరిగా మూసివేయకుండా ఉండటంతో క్రిమికీటకాలు, పురుగులు ట్యాంకులో పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే ట్యాంకు నుంచి పైపుల ద్వారా ఫ్రిడ్జ్‌లోకి నీరు చేరుతుందని, ఆ నీటినే ప్రయాణికులు తాగుతున్నారని తెలిపారు. ప్రయాణికులకు అందించే తాగునీటి విషయంలో అధికారులు కనీస పరిశుభ్రత ప్రమాణాలను పాటించకపోవడం ఆందోళనకరమన్నారు. మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు కూడా పూర్తిగా అపరిశుభ్రంగా, అధ్వాన స్థితిలో ఉన్నాయని, మరుగుదొడ్లను సైతం సక్రమంగా శుభ్రం చేయడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో బస్టాండ్ నిర్వహణ ఇష్టారాజ్యంగా మారిందని విమర్శించారు.

## యువత నిరుద్యోగ నిర్మూలన కోసం పోరాటం చేయాలి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి. కుతుబ్




**అమరచింత, ఆగస్టు 27 (సింగిడి):** మత్తును వదిలి యువత నిరుద్యోగం వైపు పోరాటం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ పిలుపునిచ్చారు. బుధవారం అమరచింత మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభల గోడపత్రికలను కుతుబ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత ప్రధాన పాత్ర పోషిస్తుందని, యువతలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలను, దేశభక్తి, లౌకిక, ప్రజాస్వామ్య ఆలోచనలను నెలకొల్పడానికి ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. 1959 మే 3న ఆవిర్భవించి నిరుద్యోగ నిర్మూలన, 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు, ఉద్యోగ, ఉపాధి కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఉద్యోగాలు లేక యువత మద్యం, సిగరెట్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్ట కేంద్రంలో రాష్ట్ర 3వ మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల ద్వారా యువతకు ఉద్యోగాలు కల్పించే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు, ధర్నాలు, ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మైబు, శ్రీకాంత్, కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబి వేడుకలు



**అమరచింత, ఆగస్టు 27 (సింగిడి):** మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం అమరచింత మండల కేంద్రంలోని జామా మసీదులో ముస్లిం సోదరులు పవిత్ర మీలాద్-ఉన్-నబి వేడుకలను ప్రత్యేక ప్రార్థనలతో ఘనంగా జరుపుకున్నారు. జామా మసీదు కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ హైకోర్టు సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. సాయంత్రం 5 గంటలకు జామా మసీదు నుంచి నబి సాబ్ మసీదు వరకు ముస్లిం యువకులు పెద్ద ఎత్తున భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ మసీదు వద్ద మౌలానాలు అల్తాఫ్ బిగ్ ఆరిఫ్ ఇబ్రహీం మహమ్మద్ ప్రవక్త కేశాలను ప్రదర్శించారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో తిలకించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకలకు పట్టణ ఎస్సై స్వాతి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

# బరువు తగ్గడం ఇక చిటికెలో పని..!

## ఉదయాన్నే ఈ డ్రింక్ తాగితే నెలలో ఊహించని రిజల్ట్..



**నిమ్మ తేనె మ్యాజిక్ :**
ఈ డ్రింక్ తాగగానే అది శరీరంలోని వివిధ వ్యవస్థలపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. నిమ్మరసం, తేనె కలయిక శరీర ఉష్ణోగ్రతను స్వల్పంగా ప్రభావితం చేసి, జీవక్రియను వేగవంతం చేస్తుంది.దీనివల్ల విశ్రాంతి సమయంలో కూడా మీ శరీరం ఎక్కువ కేలరీలను కరిగిస్తుంది. నిమ్మకాయలో ఉండే పెక్టిన్ అనే ఫైబర్ ఆకలిని నియంత్రించడమే కాకుండా శరీరంలో నిల్వ ఉన్న కొవ్వు కణాలను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. రాత్రంతా శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను, విషపదార్థాలను బయటకు పంపడంలో లివర్‌కు ఈ పానీయం తోడ్పడుతుంది.

బోనస్ ప్రయోజనాలు: ఈ అలవాటు వల్ల కేవలం కిలోలు తగ్గడమే కాకుండా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా చేకూరుతాయి. నిమ్మకాయలోని విటమిన్ సి, తేనెలోని యాంటీ బాక్టీరియల్ గుణాలు రక్తాన్ని శుద్ధి చేస్తాయి. దీనివల్ల మొటిమలు తగ్గి, చర్మం సహజంగా కాంతివంతంగా మారుతుంది. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల పేగుల కదలికలు మెరుగుపడి, మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు శరీరానికి రోగాలతో పోరాడే శక్తిని అందిస్తాయి.

సరైన పద్ధతి: చాలా మంది వేడి నీళ్లలో నిమ్మరసం కలిపి తాగుతుంటారు, కానీ అది తప్పు. నీటిని గోరువెచ్చగా మాత్రమే ఉంచాలి. మరీ వేడిగా ఉంటే తేనెలోని ఔషధ గుణాలు నశిస్తాయి. వీలైనంత వరకు కల్తీ లేని, స్వచ్ఛమైన సేంద్రియ తేనెను వాడండి. చక్కెర కలిపిన తేనె వల్ల ప్రయోజనం ఉండదు. అర చెక్క నిమ్మరసం సరిపోతుంది. మరీ ఎక్కువగా వాడితే పంటి ఎనామిల్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. గటగటా తాగేయకుండా చిన్న చిన్న గుటకలతో తాగడం వల్ల లాలాజలంతో కలిసి అది జీర్ణక్రియకు మరింత బాగా సహాయపడుతుంది.

మీ జీవనశైలిలో చేయాల్సిన మార్పులు: కేవలం ఈ పానీయం తాగి కూర్చుంటే ఫలితం ఆశించిన స్థాయిలో ఉండదు. దీనికి తోడుగా 30 నిమిషాల పాటు వాకింగ్ లేదా జిమ్, యోగా వంటివి చేయాలి. జంక్ ఫుడ్, చక్కెర పదార్థాలను తగ్గించి.. పండ్లు, కూరగాయలకు ప్రాధాన్యత ఇవ్వండి. రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగడం వల్ల మెటబాలిజం స్థిరంగా ఉంటుంది.

ఎవరు జాగ్రత్తగా ఉండాలి: నిమ్మరసంలోని ఎసిడిటీ వల్ల పళ్లు సెన్సిటివ్‌గా మారే అవకాశం ఉంది. తాగిన తర్వాత నోటిని మామూలు నీటితో పుక్కిలించడం మంచిది. అల్సర్లు లేదా తీవ్రమైన ఎసిడిటీ ఉన్నవారు ఖాళీ కడుపుతో నిమ్మరసం తీసుకోకూడదు. తేనెలో సహజ చక్కెరలు ఉంటాయి కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సలహా మేరకే దీనిని తీసుకోవాలి.







# పెట్టుబడి అవసరం లేదు.. రోజుకు 2గంటలు పనిచేస్తే చాలు..

## నెలకు రూ. 1 లక్ష పక్కా.!



వ్యాపారం చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ, పెట్టుబడి లేదనే ఆలోచన చాలామందిని వెనక్కి లాగుతుంది. అయితే, ఈ ఆధునిక యుగంలో పెట్టుబడి లేకుండానే వ్యాపారాన్ని ప్రారంభించడానికి అనేక ఉచిత ఆన్‌లైన్ సాధనాలు అందుబాటులో ఉన్నాయి.

మొదట, మీ వ్యాపారానికి ఒక బ్రాండ్ పేరును ఎంపిక చేసుకోవడం అవసరం. ఛీఖఎవటశ్రీఱఇ లాంటి వెబ్‌సైట్‌లు ఈ ప్రక్రియను సులభతరం చేస్తాయి, ఉచితంగా విభిన్నమైన పేర్లను సూచిస్తాయి. తరువాత, సోషల్ మీడియా మార్కెటింగ్ చాలా కీలకం. ఝఱఅఝ.ఉశీఎ లాంటి ప్లాట్‌ఫామ్‌లు గ్రాఫిక్ డిజైనింగ్ నైపుణ్యాలు లేని వారికి కూడా ఆకర్షణీయమైన సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు రూపొందించడానికి సహాయపడతాయి. ఇది మీ ఉత్పత్తులు లేదా సేవలను ప్రభావవంతంగా ప్రచారం చేయడానికి ఉపయోగపడుతుంది. వెబ్‌సైట్ అవసరం ఉన్న వారికి ఎఎజూవసతీఖఎ వంటి సైట్‌లు ఉచితంగా డ్రాగ్ అండ్ డ్రాప్ పద్ధతిలో వెబ్‌సైట్‌ను డిజైన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయి.

చివరగా, కస్టమర్ల నుండి చెల్లింపులను స్వీకరించ్డానికి Razorpay, Cashfree లేదా Stripవ వంటి పేమెంట్ గేట్‌వేలు ఉన్నాయి. ఇవి మీ బ్యాంక్ అకౌంట్‌కు లింక్ చేసి, కస్టమర్లు వివిధ పద్ధతులలో (క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, యూపీఐ) చెల్లింపులు చేయడానికి వీలు కల్పిస్తాయి. ఈ ఉచిత టూల్స్ సహాయంతో, మీరు మొదట్లో ఎలాంటి పెద్ద పెట్టుబడి పెట్టకుండానే మీ వ్యాపార ఆలోచనను మార్కెట్‌లో పరీక్షించుకోవచ్చు. విజయవంతమైతే, అప్పుడు అవసరమైన రిజిస్ట్రేషన్లు, ఇతర లాంఛనాలకు వెళ్లవచ్చు.

# ఉద్రిక్తతలున్నా రాణించిన సూచీలు..

## సెన్సెక్స్ 900 పాయింట్లు పైకి

***ముంబయి: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు, న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను నిలిపివేయడానికి సిద్ధమంటూ ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి పేర్కొన్నారంటూ వచ్చిన వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. దీంతో ఉద్రిక్తతల వేళ వరుస నష్టాలు చవిచూసిన సూచీలు.. లాభాల్లోకి వచ్చాయి. దీంతో ఓ దశలో సెన్సెక్స్ 1100 పాయింట్ల మేర లాభపడింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.453 లక్షల కోట్లకు చేరింది.***






సెన్సెక్స్ ఉదయం 79,530.48 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,116.19) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీలు ఇంట్రాడేలో 80,303.83 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 899.71 పాయింట్ల లాభంతో 80,015.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 285.40 పాయింట్ల లాభంతో 24,765.90 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎల్అండ్‌టీ, ఎన్టీపీసీ, రిలయన్స్, బీఈఎల్ స్టాక్స్ లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82.89 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 5150 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**లాభాలకు కారణాలు ఇవీ..**
న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను ఆపేందుకు ఇరాన్ అంగికారం తెలిపినట్లు వార్తలు వచ్చాయి. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో ఇరాన్ చర్చలకు సిద్ధమైందన్న వార్తలూ యుద్ధం త్వరలోనే ముగియబోతుందన్నసంకేతాలిచ్చాయి. అయితే, ఆ వార్తలను ఇరాన్ ఖండించడం గమనార్హం. మూడు రోజుల వరుస నష్టాల నేపథ్యంలో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో మన మార్కెట్ సూచీలు లాభపడ్డాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు త్వరలోనే చల్లారొచ్చన్న అంచనాలతో ప్రపంచ మార్కెట్లు నేడు రాణించాయి. నిన్న భారీగా పతనమైన దక్షిణ కొరియా కోస్పీ నేడు 9 శాతం మేర లాభపడింది. జపాన్, హాంకాంగ్, చైనా మార్కెట్లు కూడా రాణించడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. నిన్నటి అమెరికా మార్కెట్లు కూడా రాణించాయి.

హర్మూజ్ గుండా వెళ్లే నౌకలకు తక్కువ ధరకే బీమా కల్పిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడమూ మరో కారణం. అవసరమైతే చమురు నౌకలకు అమెరికా నౌకాదళం ఎస్కార్ట్‌గా పంపిస్తామన్నారు.

డాలరుతో రూపాయి విలువ బలోపేతమైంది. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో 92 ఎగువకు చేరిన రూపాయి విలువ మళ్లీ 91.60 స్థాయికి చేరింది. దీనికితోడు రిలయన్స్ వంటి అత్యధిక వెయిటేజీ కలిగిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచింది. క్రూడాయిల్ ధరల పెరుగుదల వల్ల (విండ్‌ఫాల్ ట్యాక్స్ విధించకపోతే) రిలయన్స్ కంపెనీ లాభపడుతుందన్న జెఫ్రీచ్ నివేదిక కొనుగోళ్ల మద్దతుకు కారణమైంది.

ప్రభాతవన
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 28-8-2026

# తప్పుల్లేని ఓటర్ జాబితా రూపకల్పనే ఎస్ఐఆర్ లక్ష్యం

### అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించాలి, : జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,





**నాగర్ కర్నూల్ (సింగిడి):** ఓటర్ జాబితాలోని చిన్నచిన్న తప్పులను సరిచేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా స్పష్టమైన, ఖచ్చితమైన ఓటర్ జాబితాను రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని, అందులో భాగంగానే నోటీసులు అందజేసి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లతో బీఎల్వో స్థాయిలో నిర్వహిస్తున్న హియరింగ్ కార్యక్రమానికి కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హియరింగ్ నిర్వహిస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించి, ఒక ఓటర్ వివరాలను యాప్ లో అప్లోడ్ చేసిన జిల్లా కలెక్టర్, ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న వివరాలు, ఆధారాలు, అభ్యంతరాలపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలో మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, మొత్తం 3010 మంది ఓటర్లు ఉండగా కేవలం 43 మంది ఓటర్లకు చిన్నచిన్న తప్పులను సరి చేసేందుకు నేటి నిర్వహించిన గ్రామ సభకు 43 మంది ఓటర్లు హాజరైనట్లు తెలిపారు. కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.. ఓటర్ జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యమైన పత్రం అని అన్నారు. జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండటంతో పాటు, నమోదైన ఓటర్ల వివరాలు కూడా ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని,ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గుర్తించిన అంశాలపై సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి నుంచి వివరణలు, అవసరమైన ఆధారాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరికి తన వాదనను వినిపించే అవకాశం కల్పించాలని, వారు సమర్పించే ఆధారాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకూడదు. గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న హియరింగ్ కార్యక్రమాల ఉద్దేశాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించి, ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రక్రియను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. హియరింగ్ కు హాజరయ్యే ప్రతి ఓటరును మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, వారు సమర్పించే పత్రాలను పరిశీలించాలని బీఎల్వోలకు సూచించారు. హియరింగ్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, నిబంధనల అమలు ప్రధానంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఓటరు తమ ఓటర్ వివరాలను పరిశీలించుకోవాలని, గ్రామంలో మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలో అందజేసిన నోటీసులు తక్కువగానే ఉన్నాయని, ఒకేరోజు నిర్వహిస్తున్న గ్రామ సభ ద్వారా ఏవైనా పొరపాట్లు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. వెన్నచర్లలో నిర్వహించిన హియరింగ్ ప్రక్రియ పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. గ్రామంలో మంచి చెరువు ఉందని, గ్రామంలోని ప్రజలు మంచి పంటలు పండించి జీవనోపాధి లక్ష్యంగా రాణించాలన్నారు. గ్రామానికి అవసరమైన మినీ ఫంక్షన్ హాల్ కేంద్రాన్ని మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, తాహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్, బీఎల్వోలు సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్వోలు, ఎన్నికల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఎల్ఓసీ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) వరం లాంటిదని, అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలకు ఈ పథకం ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన బోదాసు మంజుల భర్త యాదగిరి అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ సాయం కోరారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం సహాయ నిధి మంజూరుకు కృషి చేశారు. ఎమ్మెల్యే కృషి ఫలితంగా మంజూరైన రూ. 2 లక్షల ఎల్ఓసీ చెక్కును ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద లకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్య సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో వైద్యం కోసం వెనుకడుగు వేయాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే సూచించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అర్హత ఉన్న వారికి సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తడిసిన ప్రదీప్ రెడ్డి, మేరిగ గోపాల్, శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు



**కల్వకుర్తి (సింగిడి):** కడ్తల్ మండలంలోని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోనీ సలార్‌పూర్ గ్రామ పంచాయతీలోనీ జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో వాటర్ ట్యాంక్‌ను ప్రత్యేక పద్ధతిలో శుభ్రపరిచారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు,సర్పంచ్ నేనవత్ ప్రియ రమేష్‌నాయక్ ,ఉప సర్పంచ్ ఉదరి మహేశ్వరి కుమార్, వార్డు సభ్యులు మల్లేష్, శ్రీశైలం,శివ కుమార్,లక్ష్మణ్ నాయక్,మల్లేష్, హనుమంత్, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వర్షకాలం సందర్భంగా ప్రతిఒక్కరూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. ప్రతిఒక్కరూ గ్రామంలోని తాగునీటి నిల్వ ట్యాంకును ఆధునిక జర్మన్ టెక్నాలజీతో పూర్తిస్థాయిలో శుభ్రపరచడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుతుం దని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో ఆయనకు మా సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ఐక్యత ఫౌండేషన్‌ను చైర్మన్ సుకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ప్రజల తరుపున సర్పంచ్,ఉప సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

## మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాలుర గురుకులంలో రాఖీ పౌర్ణమి వేడుకలు



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులంలో రాఖీ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురు కులం ప్రిన్సిపాల్ మాధవి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. రాఖీ పండగ అన్నా చెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీక అని ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకొని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రేమ, ఐక్యత, సోదరభావం వంటి మానవీయ విలువల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఏటీపీ ఆంజనేయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దు

- జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా
- డిమాండ్ల సాధనకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



**నారాయణపేట (సింగిడి):** దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే తీర్చాలని, ఉద్యోగుల సహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరీక్షించవద్దని నారాయణపేట జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ నరసింహారెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు గురువారం నాడు స్థానిక వివేకానంద మున్సిపల్ పార్కు ఎదుట జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహారెడ్డి, భాధ్యులు దామోదర్, వై. జనార్ధన్ రెడ్డి, శివరాములు, దేవేంద్రప్ప తదితరులు మాట్లాడారు. కరోనా అనంతరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని రెండేళ్లుగా ఓపిక పట్టామని, కానీ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ, డీఏల విడుదల పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని తక్షణమే అమలు చేయడంతో పాటు 6 డీఏలను విడుదల చేయాలని కోరారు. ప్రతి నెలా ఉద్యోగుల జీతాల నుంచి చందా వసూలు చేస్తున్నప్పటికీ, 'ఉద్యోగ ఆరోగ్య పథకాన్ని' సరిగ్గా అమలు చేయడం లేదు, పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాల డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. విద్యాశాఖలో ప్రమోషన్ల అవరోధాలను తొలగించేందుకు కామన్ సర్వీస్ రూల్స్ అమలులోకి తేవాలని సూచించారు. సంక్షేమ పథకాలతో పాటు వ్యవస్థలో భాగమైన ఉద్యోగుల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం చూడాలని నేతలు స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30 లోగా తమ డిమాండ్లను పరిష్కరించకపోతే "చలో అసెంబ్లీ" చేపట్టి తీరుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ సి హెచ్. ప్రియాంకకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు సంతోష్ కుమార్, రెడ్డప్ప, బాలాజీ, మల్లికార్జున్, ఇతర బాధ్యులు సూర్యచంద్ర, యశ్వంత్, హైమావతి, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై యువ మోర్చా ఆగ్రహం



**కొత్తగూడెం, (సింగిడి):** విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం లోని అమరవీరుల స్తూపం--బస్టాండ్ సెంటర్ వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు జుజ్జూరు మోహన్ కృష్ణ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు జుజ్జూరు మోహన్ కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి డా. జాటోత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ. 15 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు పేరుకుపోవడంతో వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల విద్యాభవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలను వెంటనే చెల్లించకపోతే యువ మోర్చా ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీ కన్వీనర్ భీమల్ జైన్, బలగం శ్రీధర్, చుంచుపల్లి మండల నాయకులు, పాల్వంచ టౌన్ అధ్యక్షుడు రాపాక రమేష్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు వీర ప్రతాప్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి స్వప్న, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మంగీలాల్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి రాజ్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మహంకాళి శంకర్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోల హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు పొదిల్లా శ్రీను, మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి బాలసాని శివ, జిల్లా కార్యదర్శి ధారావత్ నరేష్, భద్రాద్రి జిల్లా కార్మిక సెల్ కన్వీనర్ గుమలాపురం సత్యనారాయణ, చుంచుపల్లి మండల ప్రధాన కార్యదర్శి బుర్ర సతీష్ కుమార్, యువ మోర్చా కార్యవర్గ సభ్యులు హరి ప్రసాద్, పాల్వంచ టౌన్ జనరల్ సెక్రెటరీ బానోత్ కుమార్, తాటికొండ కళ్యాణ్, బట్టు శివ, భూక్య మోహన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## విపత్తు నిర్వహణకు పక్కా ప్రణాళిక అవసరం

### విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాలబ్యూరో (సింగిడి):** వరదలు, అగ్ని ప్రమాదాలు, తదితర విపత్తుల సమయంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, దీనికి పక్కా ప్రణాళిక అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోనీ తన ఛాంబర్ లో జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్షన్ ప్లాన్ పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. బీచుపల్లి, అలంపూర్, నది అగ్రహారం వంటి నదీ పరివాహక తీర ప్రాంతాల్లో అత్యవసర సమయంలో రక్షణ చర్యలు చేపట్టేందుకు సరైన ప్రణాళికతో ముందు కెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా నదుల్లో ప్రమాదవశాత్తు ఎవరైనా మునిగిపోతుంటే కాపాడేందుకు అక్కడి గజ ఈతగాళ్లు, మత్స్యకారులకు బోట్స్, లైఫ్ జాకెట్స్, తాళ్లు, తదితర పరికరాలను అందుబాటులో ఉంచేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎవరైనా వ్యక్తులు తప్పిపోతే వెతికేందుకు, ఇతర అవసరాలకు డ్రోన్ కెమెరాలు వంటి యంత్రాలను కొనుగోలు చేయాలని సూచించారు. గద్వాల, ఆలంపూర్ లోని అగ్నిమాపక కేంద్రాల్లో ఫ్లోటింగ్ పోర్టబుల్ పంప్స్, రిమోట్ లైఫ్ బాయ్, తదితర రెస్క్యూ పరికరాలను తెప్పించేందుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లతోపాటు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో, కలెక్టరేట్లో కూడా ఫైర్ సేఫ్టీ కోసం అవసరమైన యంత్రాలను తెప్పించేం దుకు ప్రతిపాదనలు పంపాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ావు, డిపిఓ శ్రీకాంత్, అగ్నిమాపక కేంద్రం ఎస్సై రాకేష్, డి సెక్షన్ పర్యవేక్షకులు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రెనివట్ల పాఠశాలలో ఘనంగా రక్ష బంధన్ వేడుకలు



**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల పరిధిలోని రెనివట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా రక్ష బంధన్ వేడుకలు నిర్వహించిన ఉపాధ్యాయులు. కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్న చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక ఈ రక్ష బంధన్ కార్యక్రమమని ఇది అనాదిగా వస్తున్న ఆచారమని మన తోబుట్టువుల తో పాటు మన సమాజంలోని మహిళలను సోదరిమణులుగా భావించాలని, నాకు నువ్వు రక్ష నీకు నేను రక్ష మనం దేశానికి రక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వీరయ్య,బాలరాజు, రాజేష్,కృష్ణ లు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్‌లైన్ పాఠశాలలో రాఖీ పండగ వారోత్సవాలు



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** నిజామాబాద్ నగరంలోని ఆర్యనగర్‌లో గల ఫ్యూచర్ లైన్ పాఠశాలలో రాఖీ పండగ వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థులకు అన్నాచెల్లెళ్ల అనుబంధం, అక్కాతమ్ముళ్ల ఆత్మీయత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు స్వయంగా రాఖీలను తయారు చేశారు. తమ చేతులతో తయారు చేసిన రాఖీలను పరస్పరం కట్టుకుని రాఖీ పండగ విశిష్టతను చాటారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, పరస్పర గౌరవ భావాలను పెంపొందించేలా సాగింది. పాఠశాల సిబ్బంది, ఇంచార్జ్ లావణ్య, గౌతమి, శిరీష, మాధవి విద్యార్థులు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** నగరంలోని నిజామాబాద్ సుభాష్ నగర్ లోని నారాయణ స్కూల్ బ్రాంచ్ లో రక్షాబంధన్ పండుగను గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమక్షంలో ఎంతో ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ వేడుకలకు నారాయణ స్కూల్ ఏజీఎం సూర్యవంశీ శివాజీ పటేల్ ప్రత్యేకంగా హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్సై షరీఫ్ ని ఏజీఎం సాదరంగా స్వాగతించి విద్యార్థులతో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ముఖ్య అతిథులు ఎస్సై షరీఫ్ తో పాటు ఏజీఎం శివాజీలకు రాఖీలు కట్టి తమ ప్రేమాభిమానాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం సూర్యవంశీ శివాజీ పటేల్ మాట్లాడుతూ రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, ఇది ప్రేమ, అప్యాయత, పరస్పర గౌరవం, రక్షణ సోదరభావానికి ప్రతీక అని అన్నారు. పండుగలు విద్యార్థుల్లో మానవీయ విలువలను పెంపొందించడంతో పాటు, భిన్నత్వంలో ఏకత్వం అనే గొప్ప సందేశాన్ని అందిస్తాయని తెలిపారు. మరో అతిథిగా ఎస్సై షరీఫ్ హాజరై మతాలకు అతీతంగా విద్యార్థులతో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. పిల్లలతో కలిసి రాఖీలు కట్టించుకుని, వారితో ఆనందాన్ని పంచుకున్నారు. ప్రేమ, సోదరభావం, మానవత్వమే అన్ని పండుగల అసలైన సందేశమని చాటి చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ చందన మాట్లాడుతూ విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యతతో పాటు వాటి వెనుక ఉన్న మానవీయ విలువలను తెలియజేయడం ఎంతో అవసరమని అన్నారు. ప్రతి పండుగ విద్యార్థుల్లో ప్రేమ, ఐక్యత, గౌరవం, సామాజిక బాధ్యతను పెంపొందించాలని ఆకాంక్షించారు. రంగురంగుల రాఖీలు, విద్యార్థుల చిరునవ్వులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. రాఖీ ఒక దారం కాదు ప్రేమను, బాధ్యతను, అనుబంధాన్ని కలిపే బంధం అనే సందేశంతో నిర్వహించిన ఈ వేడుక విద్యార్థులకు మరపురాని అనుభూతిని అందించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి అండగా ఉప్పల వెంకటేష్ చేయూత



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి మండలంలోని గుండూర్ గ్రామానికి చెందిన వంగూరి వెంకయ్య అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్య ప్రకాష్‌రావు సర్పంచి అయిననేని లక్ష్మమ్మ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్మిక సంఘం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ సూర్యప్రకాష్‌రావు బిఆర్ఎస్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ నాగయ్య, మాజీ ఉపసర్పంచ్ బండి లక్ష్మయ్య, వార్డు మెంబర్ రాజేందర్, పోతరపల్లి కృష్ణయ్య, పోతుగంటి నాగేంద్రం, తుప్పల సత్యనారాయణ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పీసీసీ చీఫ్‌కు రాఖీ కట్టిన బ్రహ్మాకుమారీలు



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌కు నగరం లోని నాందేవ్ వాడ లోని బ్రహ్మకుమారీస్ ప్రభందకులు బి.కె.సునీత బెహెన్జీ రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఖీ భగవంతుని రక్షణ ఇస్తుందని, ఇంకా చాలా మంది కార్యాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నగర అధ్యక్షులు రామకృష్ణ, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తదితరులున్నారు.

# నానోఎరువుల వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

### క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్ (సింగిడి):** రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, నానో ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించిన నానో యూరియా, నానో డీఏపీ, ఎఫ్ఎఫ్ఎస్ (Framework for Fertilizer Sale) యాప్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ...... వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి నానో ఎరువుల వినియోగం, వాటి ఉపయోగాలు, పంటలకు అందించే పోషక విలువలు, వినియోగ విధానంపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువులను అవసరానికి అనుగుణంగా, సమతుల్యంగా వినియోగించేలా రైతులకు సూచనలు అందించాలని తెలిపారు.

రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా పథకంపై కూడా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన రైతులకు రైతు బీమా ప్రయోజనం సకాలంలో అందేలా అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసి, బీమా మొత్తాన్ని త్వరితగతిన రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాలు, పంట పొలాలను సందర్శించడం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలు, పంటల పరిస్థితి, సాగులో అవలంబిస్తున్న విధానాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి వ్యవసాయ అధికారి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక అవగాహన కల్పించాలని, రైతుల వివరాలు సక్రమంగా నమోదు కావడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ సేవలు మరింత పారదర్శకంగా, సులభంగా అందించేందుకు అవకాశం ఉంటుందని, ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎరువుల విక్రయాలు, సరఫరా తదితర ప్రక్రియల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా రైతులకు సేవలు మరింత సమర్థవంతంగా అందించవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

ఈ అవగాహన కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రతినిధులు నానో యూరియా, నానో డీఏపీ వినియోగ విధానం, వాటి ప్రయోజనాలు, పంటల్లో వినియోగించాల్సిన విధానం, ఎఫ్ఎఫ్ఎస్ యాప్ పనితీరు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులకు విస్తృత అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో పొందిన సమాచారాన్ని రైతులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించి, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వారిలో అవగాహన పెంపొందించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్, కోరమాండల్ జోనల్ మేనేజర్ సంతోష్ రెడ్డి, ఏడీఏలు, ఏఓలు, ఏఈఓలు, కోరమాండల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 28-8-2026

# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

### గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది : కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్



**జమ్మికుంట, (సింగిడి):** గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రజా దనం దుర్వినియోగమైందని ప్రజల సొమ్ముతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అసంపూర్ణంగా నిర్మించి వాటిని గాలికి వదిలేశారని జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ మహిళా అధ్యక్షురాలు రేణుక శివకుమార్ గౌడ్ అన్నారు. గురువారం జమ్మికుంట మున్సిపాలిటీ లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ల ఇండ్లను సందర్శించారు. వారు మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ పరిధి లోని ధర్మారం కేశపురం డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు సందర్శించడం జరిగిందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన స్థితిగతుల గురించి ప్రజలకు తెలపడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అసంపూర్తిగా వదిలేసిన గత ప్రభుత్వం లోని స్థానిక శాసనసభ్యులు రాజకీయం చేయొద్దంటూ వారే స్పృహ లేని రాజకీయాలు చేసుకుంటూ ప్రజల మన్ననలు పొందాలని ఒక దురుద్దేశంతో మా ప్రభుత్వంపై బురద చల్లే మాటలు మాట్లాడుతున్నారని ఇది సమంజసం కాదని తెలిపారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మీకు చిత్తశుద్ధి పదేళ్ల పాలనలో ఎందుకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంపిణీ చేయలేదని అడిగారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యే ఇదే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పై బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీసిన విషయాన్ని మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు అదే బిఆర్ఎస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీగా ప్రభుత్వ విప్ గా ఉండి కూడా నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా మంజూరు చేయలేని కౌశిక్ రెడ్డి ఇప్పుడు పేద ప్రజలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నాడని వారు మండిపడ్డారు. దొంగ దొంగ అన్న చందంగా ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఉన్నాయని ప్రజల సంక్షేమం కోసం ప్రతినిత్యం పాటుపడుతున్న ప్రభుత్వంపై అనవసరపు ఆరోపణలు చేస్తూ పబ్బం పబ్బం గడుపు కుంటున్నారని మండిపడ్డారు. అభివృద్ధి సంక్షేమాన్ని పక్కనపెట్టి కేవలం నియోజకవర్గం ఇన్చార్జిపై ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ మూడు సంవత్సరాలు పూర్తి చేశామని నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయని ఎమ్మెల్యే పై ప్రజలు తిరుగుబాటు చేసే రోజు దగ్గరలో ఉందని వారు మండిపడ్డారు. ఎన్నికల్లో ఇంచార్జ్ ప్రణవ్ గెలువకపోయినప్పటికీ ఎమ్మెల్యేలతో పోటీపడుతూ ఈ నియోజకవర్గ అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో దుబ్బ మల్లన్న చైర్మన్ ముద్దమల్ల రవి టిపిసిసి ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాయిని రవి సీనియర్ కాంగ్రెస్ నాయకులు గూడెపు సారంగపాని జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్య దొడ్డె శ్రీకాంత్ కౌన్సిలర్స్ శ్రీపతి స్వర్ణలత నరేష్ ఒగ్గు రమేష్ మాచర్ల రాజు కుతాడి తిరుపతి ఎగిత అశోక్ యాట్ల అశోక్ పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్. బండి పవన్ పాత ప్రసాద్ యం డి సలీం పోతుల శ్రీనివాస్ సలీమ్ పాషా రమేష్ మారేపల్లి అంజనేయులు అజయ్ అన్వేష్ విన్ను తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు

### సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. నరేందర్‌రెడ్డి



**కరీంనగర్, (సింగిడి):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశా లలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లా డారు. రక్షాబంధన్ భారతీయ సంప్రదాయాలకు, కుటుంబ బంధా లకు ప్రతీకగా నిలిచే ప్రత్యేకమైన పం డుగ అని డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, నమ్మకం, బాధ్యత, అనురాగాన్ని పెంపొందిం చడంతో పాటు పరస్పర గౌరవం, సోదరభావాన్ని బలపరుస్తుందని పేర్కొన్నారు. సోదరులు తమ సోదరీ మణులకు అండగా నిలిచి, ఎల్లప్పుడూ రక్షణగా ఉంటామని ప్రతిజ్ఞ చేయడం ఈ పండుగ గొప్పతనమని తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమా లు ఆకట్టుకున్నాయి. 'అన్నయ్య నా అన్నయ్య', 'అన్నా చెల్లెల అనుబంధం' తదితర నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారమితలో రక్షాబంధన్ వేడుకలు

### ప్రేమ, ఐక్యతకు ప్రతీక రక్షాబంధన్, పాఠశాల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు




**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యా వరణహిత రాఖీల తయారీ పోటీలు నిర్వహించారు. రంగురంగుల దారాలు, పూసలు, అలంకరణ సామగ్రితో విద్యార్థులు రూపొందించిన రాఖీలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు నృత్యాలు, పాటలతో అలరించారు. వివిధ తరగతులకు చెందిన విద్యార్థినులు, విద్యార్థులకు రాఖీలు కట్టి మిఠాయిలు పంచుకుని సోదర బంధాన్ని చాటుకున్నారు. ఈ సంద ర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఈ. ప్రసాదరావు మాట్లాడుతూ, రక్షాబంధన్ ప్రేమ, కరుణ, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంస్కృతిక, సృజనాత్మక అవగాహనను పెంపొందించడంతో పాటు పాఠశాలలో ఆనందోత్సాహాలను నింపుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేశ్, వినోదరావు, వి. యు. ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎన్‌ఆర్‌ఐ

### బాధితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన "చింతల "ఫ్యామిలీ



**జమ్మికుంట, (సింగిడి):** వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన కల్వల రాజకుమార్ పెయింటింగ్ వర్క్ చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. అలా పెయిం టింగ్ వర్క్ చేస్తున్న సమయంలో విద్యుత్ ఘాతానికి గురై రాజ్ కుమార్ తన రెండు కాళ్లు ఒక చేయి కోల్పోయి అంగవైకల్యంతో ఇంటివద్ద మంచానికి పరిమితమై జీవిస్తున్నాడు. బాధితుడికి భార్య తిరుమల ఇద్దరు కూతుర్లు కళ్యాణి కావ్య ఉండగా వీరి విషయాన్ని తెలుసుకున్న మామిడాల పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చింతల నిర్మల శ్యాంసుందర్ రెడ్డి దంపతుల కుమారుడు మదన్మోహన్ ( ఎన్నారై) ఆ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. చింతల శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ పదివేల ఆర్థిక సహాయంతో పాటు రాజ్ కుమార్ పిల్లలకు ప్రతి సంవత్సరం చదువు నిమిత్తం ఐదువేల రూపాయలను అందిస్తామని ఆ కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. మానవత దృక్పథంతో చింతల మదన్ మోహన్ రెడ్డి ఈ సహాయానికి గ్రామస్తులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు గుండెటి మౌనిక కాంగ్రెస్ నాయకులు గుండేటి కిష్టయ్య తాళ్లపల్లి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బండి సంజయ్ సోదరుని కుమార్తె వివాహం

### నూతన వధూవరులను ఆశీర్వదించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ సమీపంలోని వెదిరలో గల వసుధ కన్వెన్షన్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నయ్య బండి శ్రవణ్ కుమార్--సరిత దంపతుల కుమార్తె సంజన వివాహం రజినీ కాంత్‌తో గురువారం వైభవంగా జరిగింది. వివాహ వేడుకకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు హాజరై నూతన వధూవరులు సంజన-రజినీకాంత్‌లను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

## ఓటరు జాబితాపై జాగ్రత్త.. ప్రతి ఓటు హక్కుకు భరోసా..!!

### పేర్ల పరిశీలనకు వార్డు సభ.. అభ్యంతరాలు, సవరణలపై ప్రత్యేక దృష్టి
### అర్హులైన ప్రతిఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు: కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి




**గోదావరిఖని, (సింగిడి)::** ఓటరు జాబితాలో పేర్లు, వివరాల సక్రమతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు దక్కేలా చర్యలు చేపడుతున్నట్లు 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగుండం పరిధిలోని లింగాపూర్ 29వ డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వార్డు సభలో ఓటరు జాబితాపై ప్రజల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయా? లేదా? అన్నది పరిశీలించుకున్నారు. పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఉన్న తప్పులను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సవరణలకు అవకాశం.. నోటీసుల జారీ, ఓటరు జాబితాలో పేర్ల మార్పులు, వివరాల సవరణలకు సంబంధించి కొంతమందికి ఇప్పటికే నోటీసులు వచ్చినట్లు వెల్లడైంది. సంబంధిత నోటీసులను త్వరలో వారికి అందజేసి, నిబంధనల ప్రకారం అవసరమైన ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు కార్పొరేటర్ రజిని తెలిపారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరి హక్కు, అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా ఓటరు జాబితాలో లేకుండా పోకూడదని, అదే సమయంలో ఓటర్ల వ్యక్తిగత వివరాల్లో ఎలాంటి పొరపాట్లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రజలు కూడా ఓటరు జాబితాను స్వయంగా పరిశీలించుకుని, తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు అందేలా, జాబితాలోని లోపాలను సరిచేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతారని రజిని స్పష్టం చేశారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



**జమ్మికుంట (సింగిడి):** హుజురాబాద్ బిసిఐ కార్యాల యంలో సైదాపూర్ క్లస్టర్ కి సంబంధించిన 9 గ్రామాల 50 మంది మహిళా రైతులతో ప్రకృతి వ్యవసాయం పైన జమ్మికుంట కె. వి కే ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో కె వి కె సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్ రావు సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి జాతీయ మొక్కల పరిరక్షణ సంస్థ డైరెక్టర్ మరియా దాస్ క్లస్టర్ ఇంచార్జ్ మురళీధర్ ఫీల్డ్ కో ఆర్డినేటర్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం పైన పాటించాల్సిన పద్ధతులపైన అదేవిధంగా కషాయాల తయారీ విధానం పైన అవగాహన కల్పించడం జరిగింది అలాగే ముఖ్యంగా ఎలుకల నివారణ పైన ధాన్యం నిలువలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన అవగాహన కల్పించడం జరిగిందని శాస్త్రవేత్తలు తెలిపారు.

## బ్లూ బెల్స్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు

### ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణ విలువలను చాటిన విద్యార్థులు
### పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జంగ సునీత మనోహర్ రెడ్డి



**కరీంనగర్, (సింగిడి):** హనుమాన్‌నగర్ లోని బ్లూ బెల్స్ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తమ సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు పంచుకున్నారు. సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, నమ్మకం, బాధ్యత, పరస్పర రక్షణ వంటి విలువలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల మల్లారెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జంగ సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, రక్షాబంధన్ కుటుంబ బంధాలను బలోపేతం చేసే భారతీయ సంప్రదాయానికి ప్రతీక అన్నారు. విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటి విలువలను జీవితంలో ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

## ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### రెండో వేతన సవరణ సంఘం అమలు, ఆరు డీఏలు విడుదల చేయాలి
### ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి



**కరీంనగర్, (సింగిడి):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజి టెడ్ అధికారులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యా యులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంప్లా యీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మహాధర్నా చేపట్టినట్లు తెలిపారు. రెండో వేతన సవరణ సంఘాన్ని 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు, డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధ రించాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రతి నెల కనీసం రూ. 2 వేల కోట్ల నిధులు విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించే నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమకు రావాల్సిన సొంత డబ్బుల కోసం ఉద్యోగులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరిం చాలని కోరారు. ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, వారి సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని కొనసాగిస్తే ఉద్యోగుల హక్కుల సాధన కోసం భవిష్యత్‌లో మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని టీఎన్జీవోస్, తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ఎడ్ల అరవింద్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి, ఉస్మాన్‌పాషా, ఈశ్వరయ్య, అశోక్‌రావు, ఎం. డి. సలీం, కరుణాకర్‌రెడ్డి, ఎలదాసరి లింగయ్య, ముప్పిడి కిరణ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్‌సింగ్, రాజేష్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతిఒక్కరు గుర్తించాలి

### సమగ్ర ఓటర్ సవరణలో అంతా భాగస్వాములు కావాలి
### తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు



**కోరుట్ల, (సింగిడి):** ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని సమగ్ర ఓటర్ సవరణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు పిలుపునిచ్చారు. కోరుట్ల పట్టణ 13 వ వార్డు 143 145వ, 6వ వార్డు 125 126 127వ బూత్ లలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం స్థానిక 13వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, 6వ వార్డు కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి ల ఆధ్వర్యం లో ఎస్ఐఆర్ కార్యక్రమంపై వార్డు సభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి లు హాజరై ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలిని సమగ్ర ఓటర్ సవరణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకొని ఓటర్ మ్యాపింగ్ ప్రత్యేక చొరవ చూపాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటరు జాబితా సవరణ మ్యాపింగ్ కోసం ప్రతి వార్డులో వార్డు సభలు నిర్వహించాలని అధికారుల ను ఆదేశించారన్నారు. ఓటు జాబితాలో ప్రజలు భారీ ఓటు లేనిచో సంబంధిత ధ్రువపత్రాన్ని బిఎల్ఓలకు అందజేయాల్సి ఉంటుంద న్నారు. నూతన ఓటర్ల నమోదు కోసం ఫారం 6 ఓటర్ లిస్టు సవరణకై ఫారం నెంబర్ 8 అభ్యంతరాల కోసం ఫారం నెంబర్ 7 ద్వారా ఇవ్వాలని అవగాహన కల్పిస్తూ వార్డు సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కమిషనర్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ షహీద్, పలువురు కౌన్సిలర్లు అన్నం అనిల్, ఎడ్ల రమేష్, తోట గంగాధర్, బిఎల్ఓలు గంగుల (చింత) అరుణ, శీలం హిమగిరి, వార్డ్ ఆఫీసర్ రవళి బిఎల్ఏ వోలెపు రాజేష్, వార్డు ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 11వ డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### ఎస్ఐఆర్ వార్డు సభలో ఓటర్ల జాబితా పరిశీలనకు కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సన్న పిలుపు,



**కరీంనగర్, (సింగిడి)::** నగరంలోని 11వ డివిజన్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా గురువారం కట్ట రాంపూర్ న్యూ శ్రీనగర్ కాలనీ పార్కులో వార్డు సభ నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు చదివి వినిపించి, తొలగించిన, ఆచూకీ లేని, వలస వెళ్లిన, నకిలీ ఓటర్ల వివరాలను వెల్లడించారు. కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సన్న మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే అవసరమైన ధ్రువప త్రాలతో నిర్ణీత గడువులోగా కళాభారతి వద్ద సమర్పించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలని అన్నారు. డివిజన్‌లోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థ వంతంగా అందించాలనే ఉద్దేశంతో స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు నర్మదా నర్సన్న తెలిపారు. కార్యక్రమంలో బీఎల్ఓ అధికారులు, కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, పీఏసీఎస్ సింగిల్ విండో చైర్మన్ కె. శ్రీకాంత్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## యశోద ఆస్పత్రిలో ప్లాస్టిక్ శస్త్రచికిత్సల ప్రత్యేక కేంద్రం

### అత్యాధునిక సౌందర్య, పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు ఒకేచోట
### ప్రముఖ ప్లాస్టిక్ శస్త్రచికిత్స నిపుణుడు, డాక్టర్ శశికాంత్ మద్దు



**కరీంనగర్, (సింగిడి):** సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో ప్రముఖ ప్లాస్టిక్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ శశికాంత్ మద్దు ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ శస్త్రచికిత్సల అత్యుత్తమ కేంద్రం'ను ప్రారంభించారు. ఈ కేంద్రంలో సౌందర్య, పునర్నిర్మాణ శస్త్రచికిత్సలతో పాటు రైనోప్లాస్టీ, లైపోసక్షన్, చిన్నారుల క్లిష్టమైన పునర్నిర్మాణ శస్త్రచికిత్సలకు ప్రత్యేక సేవలు అందించనున్నారు. అని గురువారం రోజున కరీంనగర్ యశోద సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో డా శశికాంత్ వివ రాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, ముఖ సౌందర్యంతో పాటు, శ్వాస సంబంధిత సమస్యలను సరిదిద్దేందుకు ప్రాథమిక, పునః, సహజ ఆకృతి పరిరక్షణ, కార్యాచరణ ఆధారిత రైనోప్లాస్టీ సేవలు అందుబాటులో ఉంటాయి. సహజ ఫలితాల కోసం త్రిమితీయ చిత్రీకరణ, ఛాయాచిత్రాలు, అనుకరణ, శస్త్రచికిత్స ప్రణాళిక వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తున్నారు. శరీర ఆకృతిని మెరుగుపరిచేందుకు అధునాతన కొవ్వు తొలగింపు విధానాలతో పాటు కొవ్వు మార్పిడి చికిత్సలు కూడా నిర్వహిస్తామని, పుట్టుక తో వచ్చే చీలిక పెదవి, అంగిలి, చెవి లోపాలు, ముఖ కపాల నిర్మాణ అసాధారణతలు, కాలిన గాయాల వల్ల ఏర్పడిన వైకల్యాలు, రక్తనాళాల నిర్మాణ లోపాలతో బాధపడే చిన్నారులకు ప్రత్యేక పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు అందిస్తారు. చిన్నారుల మత్తు వైద్యం, బాల వైద్యం, మాట చికిత్స, భౌతిక చికిత్స నిపుణులతో కూడిన సమగ్ర బృందం చికిత్స అనంతరం పర్యవేక్షణ అందిస్తుందని, ప్లాస్టిక్ శస్త్రచికిత్స కేవలం రూపాన్ని మార్చడానికే పరిమితం కాదని, అవయవాల పనితీరును మెరుగుపరిచి బాధితుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన సేవలను హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు చేరువ చేయడమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. సమావేశం లో రాజేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్..

### విద్యార్థుల జీవితాలను డ్రగ్స్ ఛిన్నాభిన్నం చేస్తాయి
### బసంత్‌నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కల్పించిన రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్






**గోదావరిఖని, (సింగిడి):** విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా, వాటి దుష్ప్రభావాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల విద్యార్థుల భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగంతో చదువుపై ఏకాగ్రత తగ్గడంతో పాటు ఆరోగ్యం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వంపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు.

**లక్ష్యాలను చేరుకోకుండా చేసే మత్తు వ్యసనం**

విద్యార్థి దశలోనే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, భవిష్యత్తులో సాధించాల్సిన లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**సమాచారం అందిస్తే గోప్యతకు భరోసా**

పాఠశాల పరిసరాల్లో లేదా తమ ప్రాంతాల్లో మత్తు పదార్థాలను విక్రయిస్తున్న వారు, వాటికి అలవాటు పడిన వారి గురించి సమాచారం ఉంటే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఎక్సైజ్ కానిస్టేబుల్స్ సాగర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం

Singidi శుక్రవారం 28-8-2026

# మాటల మాంత్రికుడు డి.వి.నరసరాజు

## ఆగస్టు 28...డి.వి.నరసరాజు వర్ధంతి

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తన రచనతో ఎన్నో మరపురాని చిత్రాలను అందించిన ప్రసిద్ధ రచయిత డి.వి. నరసరాజు.

సినీ కథ, సంభాషణల రచయితగా సుప్రసిద్ధులు. ఆయన రచించిన సినిమాలలో హాస్యరసం తొణికిసలాడుతూ ప్రేక్షకుల్ని నవ్వించింది. తెలుగు పలుకుబడిని ఉపయోగించడంలో



నరసరాజు అందెవేసిన చేయి. జన సామాన్య వాడుక లోని పదాలతోనే వాడి హాస్యం వ్యంగ్యం పండించిన కృషీవలుడు డి.వి.నరసరాజు. ఆయన మౌలికంగా నాటక రంగం తెలుగు పలుకు బడిని ఉపయోగించడంలో అందెవేసిన చేయి. డి.వి. నరసరాజుగా ప్రసిద్ధుడైన దాట్ల వెంకట నరసరాజు (జూలై 15, 1920 – ఆగష్టు 28, 2006) రంగస్థల, సినిమా నటుడు, రచయిత, దర్శకుడు. 1920 జూలై 15న గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలంలోని తాళ్లూరులో జన్మించాడు. ఆయన హేతువాది.

నరసరాజు గుంటూరులోని హిందూ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, హిందూ కళాశాలలో ఇంటర్ తర్వాత మద్రాసు లయోలా కళాశాల నుండి బి.ఏ పూర్తి చేశాడు. ఇప్పుడు విజయవాడలో కలసి పోయిన ముత్యాలంపాడు గ్రామంలో తొలి గ్రాడ్యుయేట్ దాట్ల వెంకట నరసరాజు. నాటక రచయితగా జీవితాన్ని ప్రారంభించాడు. సినిమాల లోకి రాకముందు నాటక రచయితగా పేరు తెచ్చుకున్నాడు. అంతర్గాణి, ఈ ఇల్లు అమ్మబడును, వాపసు లాంటి సూపర్ హిట్ నాటకాలు రాశాడు. ఈనాడు పత్రికలో కొంతకాలం పనిచేశాడు. మొదటి నుంచి సృజనాత్మక కళల మీదే నరసరాజు దృష్టి. 1951లో పాతాళభైరవి సినిమా వందరోజుల ఉత్సవ సందర్భంగా ప్రదర్శించ బడిన నరసరాజు నాటకం "నాటకం" చూసాడు దర్శకుడు కె.వి.రెడ్డి. ఆయన ప్రతిభ చూసిన దిగ్దర్శకులు కేవీ రెడ్డి తన 'పెద్ద మనుషులు' చిత్రం ద్వారా నరసరాజును చిత్రసీమకు పరిచయం చేశారు. అలా నరసరాజు 1954లో పెద్ద మనుషులు సినిమాతో రచయితగా సినీరంగ ప్రవేశం చేశాడు. ఆ సినిమా విజయవంతం కావడంతో సినీ రచయితగా స్థిరపడ్డాడు. దొంగ రాముడు మూవీకి రచయితగా డి.వి.నరసరాజునే తీసుకున్నారు. గుండమ్మ కథకు మాటలు రాశాడు. రాముడు భీముడుకు సూపర్ డూపర్ హిట్ కొట్టించాడు.

నరసరాజుతో ఎన్టీఆర్‌కు ఎక్కువ సాన్నిహిత్యం ఉండేది. తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన సాంఘిక చిత్రాలకు ఎక్కువగా నరసరాజుకే స్క్రిప్ట్ బాధ్యతలు అప్పగించేవారు ఎన్టీఆర్. అలా రూపొందిచ్చుకున్న చిత్రాల్లో కోడలు దిద్దిన కాపురం ఒకటి. బడి పంతులు డైలాగ్స్ కోసం డబ్బులు తీసుకున్న ఆర్థిక రాయని స్థితిలో చివరకు నరసరాజు పూర్తి చేయాల్సి వచ్చింది. యన్టీఆర్ హీరోగా రూపొందిన "నాది ఆడజన్మ, సి.ఐ.డి., తిక్క శంకరయ్య, బడి పంతులు, వాడే-వీడు, మగాడు, యమగోల, కేడీ నంబర్ వన్, యుగంధర్ లాంటి చిత్రాలలో ఆయన చిరకాలం గుర్తుండేలా రచనలు చేశారు. అక్కినేని హీరోగా రూపొందిన మూగనోము, గృహలక్ష్మి, జై జవాన్, ఇద్దరు అమ్మాయిలు, శ్రీరంగనీతులు, రావుగారిల్లు చిత్రాలకు నరసరాజు రచన చేశాడు. చిత్రం నారాయణ మూర్తి తీవ్రమైన కష్టాల్లో ఉన్న పరిస్థితి చూసి సాధారణంగా పౌరాణికాలు పెద్దగా అంగీకరించని నరసరాజు భక్త ప్రహ్లదకు పని చేశారు. రంగుల రాట్నం, రాజ మకుటం లాంటి సినిమాలు ఆయన ఖాతాలోకే వస్తాయి. యమగోల చిత్రంలో చాలా పొలిటికల్ డైలాగులు పేల్చి నరసరాజు జనంతో ఈలలు కొట్టించు కున్నారు. ఎమర్జెన్సీ మీద కాంగ్రెస్ పార్టీ మీద చాలా సెటైర్లు రాయగా, తెర మీద చెప్పిన ఎన్టీఆర్ కావడంతో ఆ డైలాగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'నాటకం' అనే నాటకంతో రంగస్థలం మీద సంచలనం సృష్టించిన డి.వి.నరసరాజు తెర మీద కూడా రెండు సినిమాల్లో నటించారు. ఒక సినిమాకు దర్శకత్వం వహించాడు.

అలా నరసరాజు 92కు పైగా సినిమాలకు కథను, మాటలను సమకూర్చాడు. ఆయన దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలలో కారు దిద్దిన కాపురం ఒకటి. వి.వి. సత్య నారాయణ తొలి చిత్రం చెవిలో పువ్వులో నరసరాజు హీరోయిన్ సీత తాతగా నటించారు. మనసు-మమత చిత్రంలోనూ ఓ కీలక పాత్ర పోషించారు నరసరాజు. ఈయన చివరి సినిమా 2006 లో విడుదలైన మాయా బజార్. ఆయన 2006 ఆగస్టు 28న హైదరాబాదులో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**వలిగొండ, (సింగిడి):** మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా బత్తిని సహదేవ్ గౌడ్, ఉపాధ్యక్షులుగా శనిగారపు పాండు, గంధమల్ల నరసింహ, ప్రధాన కార్యదర్శిగా మామిడి సత్తిరెడ్డి, దండెం సరిత, గంగాపురం సాయిబాబా, సూదిని రాజశేఖర్ రెడ్డి కార్యదర్శులుగా బుగ్గ వెంకటేశం, గంగాపురం సంధ్యారాణి, కసరబోయిన నరసింహ, బండారి అనిత ,కళ్లెం బాల శంకర్ గౌడ్, రేకల బాలరాజ్ గౌడ్ లను ప్రకటించగా ఎక్స్ క్యూట్ మెంబర్లుగా ఏర్పుల యాదయ్య, ఎమ్మె నవ్య, ఎడవెల్లి మల్లేశం, జక్కల శోభ రాణి, దండ మల్లికార్జున్, మాదాను రాణి, కేసరి మహేందర్ రెడ్డి, కందుల నరేష్, కళ్లెం రాములు ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పాటు పడాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని పేదలకు అందుతున్న ప్రతి పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం సాగునీటి కాలువల విషయంలో నిర్లక్ష్యం చేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి కాలువలకు ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయలను నిధులు మంజూరు చేసి సాగునీరు అందించే ప్రక్రియను చేపట్టిందని అన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గనికి నియామక పత్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ కు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు, పిఎసిఎస్ చెర్మన్ గరిసె రవి, వివిధ గ్రామాల సర్పంచులు కుంభం వెంకట్ పాపిరెడ్డి, సామ రాంరెడ్డి, నాయకులు బత్తిని లింగయ్య, గంగాపురం సతీష్, రైతు సంఘం నాయకులు నరేందర్ రెడ్డి, గూడూరు శ్రీధర్ రెడ్డి, కాసుల వెంకన్న, గుండు దానయ్య, గుట్ట డైరెక్టర్ రాధారపు రమేష్, ఎమ్మె లింగస్వామి, ఉలిపె మల్లేశం తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయముస్తాబు

**చింతపల్లి, (సింగిడి):** భక్తుల పాలిట కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందిన మండలంలోని కుర్మపల్లి గ్రామంలో 136 సంవత్సరాల క్రితం కొలువుతీరిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ వారి కోత్స వాలను ఘనంగా నిర్వహించడానికి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో వివిధ రకాల పూలతో ఎంతో సుందరంగా అలంకరించారు. అదేవిధంగా శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గ్రామంలో జాతర, బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఆలయంలో కొలువుతీరిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి , శ్రీ కాళికా దేవి అమ్మవార్లకు నేడు ప్రత్యేకంగా పూజలు నిర్వహించనున్నారు. 29వ తేదీన శనివారం ఉదయం యజ్ఞాలు, అనంతరం స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకలు జరగనున్నాయి. 30వ తేదీన ఆదివారం ఉదయం



వివిధ రకాల పూజలు, అమ్మవారి ఘటాల అలంకరణ, అమ్మవారికి ఒడి బియ్యం వేడుకలను ఉదయం 11.00 గంటలకు నిర్వహించనున్నారు. సాయంత్రం 6.00 గంటలకు బోనాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 31వ తేదీన సోమవారం సాయంత్రం 4.00 గంటలకు బోనాల ఊరేగింపు, రాత్రి 7.00 గంటలకు రంగుల వేడుకలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీన శ్రీ ఈశ్వరీమాత పవళింపు సేవను నిర్వహించనున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాటు సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముంజంపల్లి విద్యాధరా చారి తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు ఎంతో సహకరించడం అభినందనయమన్నారు. ఉత్సవాల్లో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

# అర్హత ఉన్న ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండాలి

### తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్



**తొర్రూరు, (సింగిడి)** తొర్రూరు పట్టణంలో అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండాలని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అన్నారు. డివిజన్ కేంద్రంలో మున్సిపాలిటీ కార్యాలయం, హైస్కూల్ ప్రాంగణంలో గురువారం ఓటర్ల ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఎస్ఐ ఆర్ ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా మున్సిపల్ పట్టణంలో ఉన్న వార్డులలో గతంలో బిఎల్వోలు ఓటర్ల వద్దకు ఓటర్లకు తమ నమోదు పత్రాలను అందజేశారని, వాటి ప్రకారం స్వీకరించిన దరఖాస్తులను కంప్యూటర్ ఈ కంప్యూటరీ కరణ చేసిన విఆర్వోలు ఆ జాబితాలను ఓటర్లకు తమ వివరాలను తెలిపారు. కమిషనర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ నో మ్యాపింగ్ ప్రక్రియలో ఉన్న పేర్లకు నోటీసులు అందిస్తారని, ముద్రణలో కంప్యూటర్ లో జరిగిన చిన్న చిన్న తప్పిదాలను తిరిగి సరి చేసుకోవాలని ఓటర్లకు సూచించారు. ఈ ప్రక్రియలో అనామలస్ కంప్యూటర్లలో జరిగిన చిన్న చిన్న తప్పిదాలు ఉన్నాగాని హోటల్ జాబితాలో చూసుకొని సరి చేయించుకోవాలని, ఈ బాధ్యత ఓటర్లదేనని స్పష్టం చేశారు. నోటీసులు అందుకున్న వారు ఎన్నికల కమిషన్ తెలిపిన 12 రకాల ధ్రువీకరణ పత్రాలలో ఏదైనా వస్తువు అందజేయాలని, అక్టోబర్ 15వ తేదీ లోపు వీటిని స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. ఓటర్లకు ఏమైనా సందేహాలు ఉన్నచో బిఎల్ఓ లను లేదా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తూర్పాటి రవి, పేర్ల జంపన్న, ముద్దసాని సురేష్,కర్నే నాగరాజు, ధరావత్ పద్మ, శ్యామల,బిఎల్వోలు, బిఎల్ఏలు ఓటర్లు పాల్గొన్నారు



# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే నాయిని

**హనుమకొండ, (సింగిడి)** ఉద్యోగు లు, ఉపాధ్యా యులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలనే తనకు కూడా ఉందని, సమస్యలపై పోరాడకుండా, తప్పించుకుని తిరగడం తనకు అలవాటు లేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇప్పటికే చర్చించిన తర్వాతే తాను ధర్నా కార్యక్రమానికి హాజరయ్యానని తెలిపారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లైన రెండో పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓ పీ ఎస్) పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న డీఏల మంజూరు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే శుభవార్త వస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. హెల్త్ కార్డులు, రిటైర్మెంట్‌కు సంబంధించిన సమస్యలతో పాటు ఉద్యోగులు,




పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇతర ఇబ్బందుల పరిష్కారానికి సంబంధిత మంత్రులు, ఆర్థిక శాఖతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ, ఒక్కో సమస్యను ప్రాధాన్యత క్రమంలోపరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆశీర్వాదంతో ఈ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీ ఎన్జీ ఓస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, (సింగిడి)**
కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ గురువారం మహదేవపురం డివిజన్‌కు చెందిన దొంపబోయిన శ్రీనివాస్ కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈనాడు పత్రిక విలేకరి నరసింహ కుమార్తె వివాహం



కొంపల్లిలోని ఏ ఎమ్ ఆర్ గార్డెన్స్ లో జరగగా, వివాహ వేడుకకు కూన శ్రీశైలం గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసం తోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# తక్కువ ఇసుకతో మోసం.. లారీ పట్టివేత

### స్టేషన్ లో ఫిర్యాదు చేసిన లారీ యజమానుల సంఘం

### గత వారం రోజుల వ్యవధిలో మూడు ఘటనలు

**పటాన్చెరు, (సింగిడి)** ఇళ్ల నిర్మాణ దారులను తక్కువ ఇసుకతో మోసం చేస్తున్నారంటూ ఇసుక రవాణా లారీ యజమానుల సంఘం సభ్యులు ఓ లారీని, దాని డ్రైవర్ ను పట్టుకుని పటాన్‌చెరు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా కొందరు ఇసుక లారీ నిర్వాహకులు తక్కువ ధరకు ఇసుక సరఫరా చేస్తున్నామని చెప్పి, నిర్ణీత పరిమాణం కంటే తక్కువ ఇసుకను తరలిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని సంఘం సభ్యులు తెలిపారు. దీనిపై నిఘా ఉంచిన వారు గురువారం ఇంద్రేశం పరిధిలో అనుమానాస్పదంగా ఉన్న లారీని తనిఖీ చేయగా సుమారు 9 టన్నుల ఇసుక తేడా ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నట్లు చెప్పారు. లారీ, డ్రైవర్‌ను పటాన్‌చెరు పోలీసులకు అప్పగించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. గత వారం రోజుల వ్యవధిలో ఇలాంటి ఘటనల్లో ముగ్గురిని పట్టుకున్నామని సంఘం సభ్యులు తెలిపారు. కొందరు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఇళ్ల నిర్మాణ యజమానులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంట నిర్వాహకులు కూడా తప్పుడు తూకాలు వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువకు ఇసుక ఇస్తున్నామనే పేరుతో పరిమాణంలో కోత విధిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక కొనుగోలు చేసే ఇళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వారి పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు దేవేందర్ రెడ్డి, లక్ష్మణ్, ప్రవీణ్, రాజు, గోపాల్, సుమంత్ రెడ్డి, ప్రభాకర్, అనంతయ్య, మెహబూబ్‌ఖాన్, ప్రవీణ్ రెడ్డి, పండరి, రాములు తదితరులు పాల్గొన్నారు. కలుద్దాం




# ఓటర్ సవరణపై ఎలాంటి సందేహాలు ఉన్నా.. గ్రామ సభలలో నివృత్తి చేసుకోండి

### ప్రతి ఒక ఓటర్ బిఎల్ఓలకు సహకరించాలి మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి వెల్లడి




**మేడ్చల్ కలెక్టరేట్, (సింగిడి)** ఓటర్లు తమ ఓటరు వివరాలను పరిశీలించి ఏవైన తప్పులు, అభ్యంతరాలు ఉన్నట్లయితే గ్రామ సభలలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. గురువారం శామీర్ పేట్ మండలంలో శామీర్ పేట్ గ్రామంలో సర్ పై నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ హాజరై, మట్లాడతూ గ్రామసభను పూర్తి పారదర్శకతతో, నిబంధనల ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటరు సవరణ పైఏలాంటి సందేహాలు ఉన్న గ్రామ సభలలో నివృత్తి చేసుకోవాలన్నారు. 2002 లో ఓటరు జాబితాలో ఉన్న వివరాలు, ప్రస్తుతం ఉన్న జాబితాలో వివరాలు సరిచూడడం జరిగింది. మీరు ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలలో 2002 నాటి వివరాలులేకపోయినట్లయిన, చిన్న చిన్న సవరణలు, ఉన్నట్లుతే వారి డాక్యుమెంట్స్ వెరిఫై చేసుకొని సవరణ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్స్ బిఎల్వోలు వచ్చి నోటీస్ ఇస్తారు, ఓటరుకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఇవ్వగలిగితే మీ పేరు ఫైనల్ జాబితాలో ఉంటుందని, ప్రతి ఒక ఓటరు బిఎల్ ఓలతో సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు సవరణ జాబితాకు సంబంధించి 11 డాక్యుమెంట్స్ ఏవైతే



ఉన్నాయో, మీ దగ్గర ఏది అందుబాటులో ఉందని చూసుకొని ఆ డాక్యుమెంట్స్ బిఎల్ఓకు ఇస్తే తప్పకుండా ఫైనల్ పబ్లికేషన్ చేసేటప్పుడు మీ పేరు, మీ కుటుంబ సభ్యులు వారందరి పేర్లు కూడా వస్తాయన్నారు. ఓటరు సవరణ పై ఏవైనా సందేహాలు ఉంటే అడగమని కలెక్టర్ కోరగా, కొంతమంది ఓటరు జాబితాలో ప్రస్తుత ఫోటో అప్ డేట్ కావడం లేదని తెలుపగా, కలెక్టర్ స్పందిస్తూ ఫైనల్ లిస్టులో ఫోటో సవరింపులు జరుగుతాయని తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ఫార్మ్ 6, చనిపోయిన వాళ్లకు సంబంధించినది ఫార్మ్ 7, మీకు ఎటువంటి సవరణలు చేయాలన్నా అంటే పేరు, ఫోన్ నంబర్, అడ్రస్ వంటి ఎలాంటి సవరణలు ఉన్న ఫార్మ్ 8 లో చేసుకోవాలన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని సూచించారు. అనంతరం ప్రక్కనే ఉన్న అంగన వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కేంద్రంలో ఎంత మంది పిల్లలు ఉన్నారని, వారికి సరైన పౌష్టికాహారం అందుతుందా అని కలెక్టర్ అంగన్ వాడీ టీచరును అడిగి తెలుసుకున్నారు. పిల్లలు హైట్ కు తగిన వెయిట్ ఉండేలా వారికి ఆహారం అందించాలని సూచించారు. బరువు తగ్గకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించి ఆనందించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, శామీర్ పేట్ తహాసీల్దారు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధరాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, పాల్గొన్నారు.

# మళ్లీ సురువైన అక్రమ దండ

### అక్రమంగా 21 టన్నుల పీడీఎస్ బియ్యం నిల్వ స్వాధీనం : నలుగురు అరెస్ట్



**మిర్యాలగూడ (సింగిడి)::** అవంతిపురం గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మి గణపతి ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్ మిల్ వద్ద అక్రమంగా నిల్వ చేసిన సుమారు 21 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో ఈ నెల 26న సాయంత్రం 4.30 గంటల సమయంలో రైస్ మిల్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తెల్ల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లుకు తరలించి, పాలిష్ చేయడంతో పాటు ఇతర బస్తాల్లో రీప్యాకింగ్ చేసి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచినట్లు గుర్తించారు. 420 సంచుల్లో, ఒక్కో సంచిలో 50 కిలోల చొప్పున మొత్తం 21 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని, అలాగే బియ్యం తరలించేందుకు ఉపయోగించిన ఐచర్ మినీ డీసీఎం (టూ 05 ఖఖీ 6431)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సోమ రామకృష్ణ, చిమ్మట వెంకన్న, చిమ్మట లోకేష్, సయ్యద్ నదీమ్లను అరెస్ట్ చేశారు. దర్యాప్తులో రామకృష్ణ వివిధ తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు, వెంకన్న, లోకేష్ బియ్యాన్ని పాలిష్ చేసి రీప్యాకింగ్ చేయడంలో సహకరిస్తున్నట్లు, నదీమ్ డ్రైవర్‌గా బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా ఇతర విధాలుగా దుర్వినియోగం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ పోలీసులు హెచ్చరించారు. ఈ అక్రమ వ్యాపారంతో సంబంధం ఉన్న మరికొందరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

# వృద్ధాశ్రమంలో జాలే తిలక్ రెడ్డి జన్మదిన వేడుకలు

**చింతపల్లి, (సింగిడి):** మండల కేంద్రంలో జాలే తిలక్ రెడ్డి జన్మదిన వేడుకలను జాలే బ్రదర్స్ అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల జేఎన్ఆర్ యువసేన సభ్యులు జాలే తిలక్ రెడ్డి జన్మదిన శుభసందర్భంగా వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకులు జాలే బ్రదర్స్ నరసింహారెడ్డి, తిలక్ రెడ్డిలపై వృద్ధుల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో చెట్టిపల్లి చిరంజీవి, జగన్, మురళీ, వంశీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# రూ.75 వేల విలువైన ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, (సింగిడి):** ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం కి చెందిన బొంత తరుణ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ఎల్ ఓ సి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 75 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని గురువారం పటాన్చెరు లోని తన కార్యాలయంలో తరుణ్ కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పాల్గొన్నారు.

సింగిడి ప్రతి రంగూ ఓ నిజం Singidi శుక్రవారం 28-8-2026

# బాలాజి టీచింగ్ స్కూల్‌లో ఘనంగా ముందస్తు రాఖీ వేడుకలు

భూపాలపల్లి, (సింగిడి): భూపాలపల్లి బ్రాంచ్ బాలాజి ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో గురువారం రోజున రాఖీ పౌర్ణమి (రక్షా బంధన్) వేడుకలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని సోదర--సోదరీమణుల మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీకగా ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాఖీ పండుగ ప్రాముఖ్యతను, భారతీయ సంస్కృతితో దానికి ఉన్న విశిష్టతను విద్యార్థులకు వివరించారు. చిన్నారులు స్వయంగా తయారు చేసిన రంగురంగుల రాఖీలను ప్రదర్శించి, తమ తోటి స్నేహితులకు కట్టి ఆనందం వ్యక్తం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలే మన గుర్తింపు: డాక్టర్ వి. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి బాలాజి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ వి. రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు పిల్లల్లో ఐక్యత, సోదరభావం వంటి మానవీయ విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

**దేశ రక్షణే మన అందరి లక్ష్యం: ప్రిన్సిపాల్ రజనీకాంత్**

పాఠశాల ప్రిన్సిపాల్ రజనీకాంత్ మాట్లాడుతూ, రక్షా బంధన్ అంటే



కేవలం ఒక దారం కట్టడం మాత్రమే కాదని, అది అక్కచెల్లెళ్ల కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని ఇచ్చే భరోసా అని తెలిపారు. "నీకు నేను రక్ష -- నాకు నువ్వు రక్ష, మనందరం దేశానికి రక్ష" అనే దివ్య నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎంతో ఆనందోత్సాహాల మధ్య సాగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జైల్లో ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు: ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ ప్రతినిధి (సింగిడి): జైల్లో ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లను చేసుకోవాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అధికారులకు సూచించారు. గురువారం నల్లగొండ జిల్లా జైలును సందర్శించి జైలు భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్‌తో కలిసి జైలు పరిసరాలు, భద్రతా విధానాలు, సెక్యూరిటీ పాయింట్లు, ప్రవేశ--నిష్క్రమణ ప్రాంతాలను పరిశీలించి, భద్రతాపరంగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జైలు భద్రతకు సంబంధించి సెక్యూరిటీ పాయింట్ ఆఫ్ వ్యూలో అవసరమైన సూచనలు, సలహాలను జైలు సూపరింటెండెంట్‌కు అందజేశారు.



జైలు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెక్యూరిటీ పాయింట్ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా చూడాలని తెలిపారు. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించే విధంగా ముందస్తు కార్యాచరణ సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. జైలులో భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, లోటుపాట్లు గుర్తించిన వెంటనే వాటిని సరిదిద్దాలని తెలిపారు. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్, జైలు అధికారులు, సిబ్బంది మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పంట మార్పిడి విధానంలో రైతులకు అధిక లాభాలు

**కూరగాయలు, ఆయిల్ పామ్, ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి కలెక్టర్ అనురాగ్ జయంతి**





యాదాద్రి భువనగిరి, (సింగిడి): వర్ష ప్రభావం వంటి జిల్లాలోని రైతులు వరి పంటలకు ప్రత్యామ్నాయంగా పంట మార్పిడి విధానంలో కూరగాయలు పూలు ఆయిల్ పామ్ ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం బొమ్మలరామారం మండలం మేడిపల్లి గ్రామంలో వేస్తున్న పాలీహౌస్, కూరగాయల సాగు ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. పాలీహౌస్‌లో సాగు చేస్తున్న జెర్బెరా పూలను కలెక్టర్ పరిశీలించి, రైతుతో సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో పాలీహౌస్ ఏర్పాటు చేశారు, ఎన్ని సంవత్సరాలుగా జెర్బెరా పూల సాగు చేస్తున్నారు, వాణిజ్యంగా సాగుకు ఎంత ఖర్చు అవుతుంది, ఎంత ఆదాయం వస్తుంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నా రు. పూలను ఎక్కడ విక్రయిస్తున్నారు, మార్కెటింగ్ విధా నం ఎలా ఉంది, జెర్బెరా సాగును ఎంచుకోవడానికి గల కారణాలు ఏమిటి, సాగుకు ఎంత నీరు అవసరమవు తుంది తదితర వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. పాలీహౌస్ ద్వారా పూల సాగు చేపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు, పంట దిగుబడి, మార్కెటింగ్ అవకాశాలను పరిశీలించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడి, మెరుగైన ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను సూచించారు. అదేవిధంగా అదే గ్రామంలో మరో రైతు సాగు చేస్తున్న టమాట, మిర్చి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్ని సంవత్సరాలుగా ఈ పంటలను సాగు చేస్తున్నారు, ఎకరాకు ఎంత దిగుబడి వస్తుంది, పంట సాగుకు అయ్యే ఖర్చు, లభిస్తున్న ఆదాయం తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. పండించిన టమాట, మిర్చిని స్థానిక మార్కెట్‌లో విక్రయిస్తున్నారా లేదా ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారా అనే విషయాలను కూడా తెలుసుకున్నారు. తక్కువ నీటితో డ్రిప్ ద్వారా సాగు చేసి నీటిని ఆదా చేసుకొని అధికంగా లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. రైతులకు అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ, ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించాలని, పంటలకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి హేమలత, సర్పంచ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ

**తెలంగాణ రాష్ట్ర కోసం పరితపించిన వ్యక్తి సుదర్శన్ రెడ్డి ఆయన పోరాటం ఎప్పటికీ చిరస్మరణీయం టీబీజీకేఎస్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య**

భూపాలపల్లి, (సింగిడి) సాధారణ స్థానిక నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి, ఉద్యమ నాయకుడిగా ఎదిగిన పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు అమూల్యమని టీబీజీకేఎస్ భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య కొనియాడారు. గురువారం నిర్వహించిన పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభలో ఆయన పాల్గొని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బడితల సమ్మయ్య మాట్లాడుతూ.. 2001 నుంచి సుదర్శన్ రెడ్డితో కలిసి తెలంగాణ మలిదశ ఉద్యమంలో పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ స్వ రాష్ట్ర సాధనకై సుదర్శన్ రెడ్డి ఎనలేని కృషి చేశారని తెలిపారు. ప్రత్యేకించి సింగరేణి కార్మిక సంఘం ఎన్నికలలో భూపాలపల్లి ఇంచార్జిగా బాధ్యతలు నిర్వర్తించి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం విజయానికి ఆయన రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేశారని పేర్కొన్నారు. తెలంగాణ సాధన



కోసం, పార్టీ బలోపేతం కోసం ఆయన చూపిన చొరవ, కష్టపడే తత్వం ఉద్యమకారులందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఈ సంతాప కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ రమణారెడ్డి



మిర్యాలగూడ, (సింగిడి) స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు అయి విజయవంతం చేయాలని మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి కోరారు. గురువారం మిర్యాలగూడ పట్టణం 47, 39వ వార్డుల్లో జరిగిన ఎస్ఐఆర్ కార్యక్రమం పరిశీలించిన అనంతరం ఆయన ప్రజలు, బిఎల్ఓలు, బిఎల్ఏతో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు పోకుండా సక్రమంగా వినియోగించుకునేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలున్నా సంబంధిత అధికారులను సంప్రదించి, ప్రక్రియను పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటే పునాది ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణే మన బాధ్యత. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ డివిజన్ డిఏఓ జె. శ్రీనివాస్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ సతీష్, బిఎల్ఓ విజయలక్ష్మి, నాయకులు రేపాల రమేష్ లున్నారు. అనంతరం వేములపల్లి మండలం గంద్రవానిగూడెం గ్రామ సభలో ఆయన తహసీల్దార్ హేమలతతో కలిసి పాల్గొన్నారు.

# 44,467 మందికి మందికి నోటీసులు

**12 రకాల గుర్తింపు పత్రాలను ఏదో ఒకటి అధికారులకు చూపించాలి ఆర్డీవో రమణా రెడ్డి**

మిర్యాలగూడ , (సింగిడి): ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియ భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 44,467 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరిగిందని ఆర్డీఓ రమణా రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు ల సమావేశంలో ఆర్డీఓ రమణారెడ్డి మాట్లా డుతూ నియోజకవర్గ వ్యాప్తంగా మ్యాపింగ్ జరగ కుండా ఉన్నవారు ఓటర్ లిస్ట్ లో కరెక్షన్లు ఉన్నవారు 44,467 మంది ఓటర్లు ఉన్నారని వీరికి నోటీసులు జారీ చేయడం జరిగిందని నోటీసులో ఉన్న తేదీన అక్కడ ఉన్న గ్రామపంచాయతీలో హాజరై భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల సర్టిఫికెట్లలో ఏదైనా ఒకటి చూపించాలని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల ఓట్లు ఎవరివి పోవని సూచించారు. పేరులో ,ఇంటి పేరులో, ఏదైనా అక్షర



దోషాలు ఉన్న సందర్భంలో కూడా నోటీసులు ఇవ్వడం జరిగిందని 12 రకాల సర్టిఫికెట్లు ఏదైనా అధికారులకు అందజేసి సహకరించాలని సూచించారు. ఓటర్లు ఏమైనా అబ్జెక్షన్లు క్లెయిమ్స్ ఉన్నట్లయితే సెప్టెంబర్ 16 వరకు అధికారులకు అందజేయాలని సూచించారు. అక్టోబర్ 19న తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

## వృద్ధాశ్రమంలో అంజన్నగౌడ్ జన్మదిన వేడుకలు



కోదాడ, (సింగిడి): సీనియర్ జర్నలిస్ట్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కారింగుల అంజన్నగౌడ్ జన్మదినాన్ని పురస్కరించు కుని కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు గంధం రాము ఆధ్వర్యంలో ముకుందాపురంలోని ఇందిరా అనాథ వృద్ధాశ్ర మంలో 45 మంది వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియా సభ్యులు మాట్లాడుతూ అధ్యాపకుడిగా జీవితాన్ని ప్రారంభించి జర్నలిజం వృత్తిలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ 35 సంవత్సరాలుగా విలేకరి వృత్తిలో కొనసాగు తున్న కారింగుల అంజన్నగౌడ్ యువతకు ఆదర్శమన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేసిన ఘనత ఆయనదన్నారు. ప్రస్తుతం జర్నలిజం వృత్తిని ఎంచుకుంటున్న యువత అంజన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు గాంధీ, ఉపాధ్యక్షుడు సురేష్, కుడుముల సైదులు, గోపాల్, వాసు, సంపత్, శ్రీకాంత్, నజీర్, మహేష్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాగరాజుకి రాఖీ కట్టిన చిన్నారులు



హన్మకొండ, (సింగిడి): అన్నా చెల్లెలి అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని వర్దన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రక్షాబంధన్ సందర్భం గా కాజీపేటకు వండర్ ప్లే స్కూల్ చిన్నారులు ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా చిన్నారుల కు ఎమ్మెల్యే స్వీట్స్ తినిపించి రక్షాబంధన్ శుభా కాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. పండుగా ప్రతి కుటుంబంలో ఆనందం ఆప్యాయతలు నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వినీలా,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టు నష్టపరిహారంలో సమానత్వం పాటించాలి

**లింగంపల్లి వెంకటయ్య**

చింతపల్లి, (సింగిడి) డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రాజెక్టు భూసేకరణలో నష్టపరిహారం విషయంలో రైతులందరికీ సమాన న్యాయం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరారు. గ్రామంలో కొందరు అగ్రవర్ణ రైతులకు ఎకరాకు రూ. 12. 30 లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తుండగా, ఎస్సీ, బీసీ, ఇతర బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతులకు ఎకరాకు రూ. 5. 15 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆయన ఆరోపించారు. గ్రామంలో ఒక వ్యక్తి పేరు మీద సుమారు 80 ఎకరాలు, మరో వ్యక్తి పేరుమీద సుమారు 100 ఎకరాల భూమి ఉందని, మిగతా భూముల్లో ఎక్కువ భాగం ఎస్సీ, బీసీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన



రైతులదని తెలిపారు. ఒకే ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులందరికీ ఒకే విధమైన నష్టపరిహారం చెల్లించాలని, కులం ఆధారంగా తేడా చూపడం సరికాదని వెంకటయ్య అన్నారు. బడుగు బలహీన వర్గాల రైతులకు కూడా ఎకరాకు రూ. 12. 30 లక్షల నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అంజన్‌గౌడ్ జన్మదిన వేడుకల్లో అన్నదానం

కోదాడ, (సింగిడి): రాష్ట్ర జర్నలిస్టుల నాయకుడు కారింగుల అంజన్‌గౌడ్ జన్మదిన వేడుకలను కోదాడ పట్టణంలోని శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల ఆశ్రమంలో గురువారం ఘనంగా నిర్వహిం చారు. సీనియర్ జర్నలిస్ట్ తోటపల్లి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జర్నలిస్టులు ఆశ్రమంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి, అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా తోటపల్లి నాగరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కలం పట్టే జర్నలిస్టులు సేవా కార్యక్రమాల్లోనూ ముందుండటం అభినందనీయమన్నారు. ఆపన్నులను ఆదుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అంజన్‌గౌడ్ జన్మదినాన్ని



ఆశ్రమంలో నిర్వహించడం ద్వారా సేవా స్ఫూర్తిని చాటుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కుడుముల సైదులు, సన్నీరు మురళి, నజీర్, గంధం వెంకట నారాయణ, చెరుకుపల్లి శ్రీకాంత్, దామోదర్, సంపత్, శ్రీనివాస్, వాసు, శేఖర్, సునీల్, రంగా, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకై హైవేపై పెట్రోలింగ్ పెంచాలి

**అదనపు కలెక్టర్ ప్రేమ్ కిరణ్ రెడ్డి**

నల్లగొండ ప్రతినిధి (సింగిడి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు హైవే పెట్రోలింగ్ పెంచడంతోపాటు, ప్రమాదాలు సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రేమ్ కిరణ్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశ మంది రంలో జాతీయ రహదారి టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ జాతీయ రహదా రిపై ప్రమాదాలను నివారించ డంలో భాగంగా రహదారిపై ప్రమాదాలు జరగకుండా ఏర్పా టు చేసే సూచిక బోర్డులతో పాటు, దాబాలు,హోటళ్లు, పా ర్కింగ్ స్థలాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవా ల్సిన చర్యలు తదితర అంశాలపై మరోసారి పూర్తిస్థాయిలో డ్రైవర్లు,ప్రజలు, వాహనదా రులకు అవగాహన కల్పించా ల్సిన అవసరం ఉందని అన్నారు. . రోడ్డుకిరుపక్కల రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసే దాబాలు, హోటల్లు, వాహనాల కు గాలిని కొట్టే షాపులు, టీ కొట్లు, పాన్ డబ్బాల వంటివి రోడ్డుపై కాకుండా దూరంగా ఏర్పాటు చేసుకునేలా చూడాలని, ఇందు కు అవసరమైతే రోడ్డును ఆక్రమించి షాపులు ఏర్పాటు చేసుకున్న వారికి నోటీసులు ఇవ్వాలని, నోటీసులకు స్పందించకుంటే క్రేన్లు ఏర్పాటు చేసి తొలగించేలా చూడాలని అన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణ చర్యలు



తీసుకునేందుకు ప్రతి 30, 40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున అంబులెన్స్, క్రేన్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ప్రమాదాలు సంబంధించిన పుడు అంబులెన్స్, ఆసుపత్రి సిబ్బంది, పోలీసు, హైవే పెట్రోల్ సిబ్బంది తో పాటు, సంబంధిత శాఖలందరూ స్పందించాల్సిన అవసరం ఉందని, అలాగే డ్రైవర్లు నిరంతరం డ్రైవింగ్ చేయడం వలన ఉదయం సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నా యని, అలా కాకుండా ప్రతి 2 గంటలకు ఒకసారి ఆగి తిరిగి డ్రైవింగ్ చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. 80 కిలోమీటర్లు మించి వేగం వెళ్లకుండా నియంత్రించాలని, ఎవరైనా రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన జరిమానాలు విధించాలన్నారు. ట్రక్కులకు, లారీలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రక్ లే బేస్ లలో మాత్రమే వాహనాలు నిలిపేలా చూడాలని, నో పార్కింగ్ స్థలాలలో ఎట్టి పరిస్థితులలో వాహనాలు నిలపవద్దని, ఏదైనా ప్రమాదం జరిగి రహదారిపైనే వాహనాలు నిలిచిపోతే అక్కడ తప్పనిసరిగా సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని, సర్వీస్ రోడ్ల నుంచి ప్రధాన రహదారికి కలిసే చోట, అలాగే ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్నచోట, పార్కింగ్ స్థలాల వద్ద అవసరమైన బోర్డులు ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది. జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవించకుండా అన్ని నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరు వ్యక్తిగత భద్రతలో భాగంగా సీట్ బెల్ట్ , హెల్మెట్ ధరించాలని, రహదారులపై ప్రత్యేకించి జాతీయ రహదారిపై పెట్రోలింగ్ పెంచాలని ,1033 పై విస్తృత ప్రచారం కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి పెనాల్టీలు విధించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి దశరథ ,ఆర్ అండ్ బి, జాతీయ రహదారి, వైద్య ఆరోగ్య, పోలీస్,ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# హనుమకొండ కలెక్టరేట్లో ఉద్రిక్తత

**పాలిటెక్నిక్ విద్యార్థులకు, టీఎన్జీ ఓ నాయకులకు సంఘీభావం తెలిపిన హరీష్ రావు, పోలీసుల అక్రమ అరెస్టుతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట పోలీసు వాహనాన్నీ నిరాకరించి కాలినడకన సుబేదారి పోలీస్ స్టేషన్ కు వెళ్లిన హరీష్ రావు**





హనుమకొండ, (సింగిడి): హరీష్‌రావు హనుమకొండ పర్యటన అనుమతి లేదంటూ హైదరాబాదులోని ఆయన నివాసం వద్ద పోలీసులు గురువారం అడ్డుకొని హౌస్ అరెస్టు చేసే ప్రయత్నం విఫలం కావడంతో అక్కడ నుండి హరీష్ రావు నేరుగా హనుమకొండ కలెక్టరేట్కు చేరుకున్నారు. అక్కడ పాలిటెక్నిక్ విద్యార్థులు జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ తో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వీరితో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఎన్జీవో లు సైతం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న హరీష్‌రావు వీరికి మద్దతు తెలిపారు. హరీష్ రావు హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చిన నేపథ్యంలో ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. సుబేదారి పోలీసుల పోలీసులు అక్కడికి చేరుకొని హరీష్ రావును అరెస్టు చేయడం కొద్ది క్షణాల్లోనే జరిగిపోయింది. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసుల మధ్య తోపులాట జరిగింది. హరీష్ రావును అరెస్టు చేసిన పోలీసులు పోలీస్ వాహనంలో తరలించే ప్రయత్నంలోనే హరీష్ రావు నిరాకరించి అక్కడి నుండి సుబేదారి పోలీస్ స్టేషన్ వరకు కాలినడకన వెళ్లారు. దీంతో కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన, ధర్నా నిర్వహించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. హరీష్ రావు అరెస్టు, విడుదల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస పాలన కొనసాగిస్తున్నాడని దుయ్యబట్టారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రైవేటు వ్యవస్థకు తాకట్టు పెట్టేందుకే స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తున్నాడని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవంగా స్కిల్ యూనివర్సిటీ ప్రభుత్వ సెక్టార్ కాదని ప్రవేట్ వ్యవస్థని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి స్కిల్ యూనివర్సిటీ నుండి ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ లాంటి రాష్ట్రాలు వెనక్కి తీసుకొని ప్రభుత్వంలో కలపడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి గురువు అయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయు డు అనుసరించిన తీరును అనుసరించాలని ఆయన సూచించారు. విద్యార్థుల సమస్యల పట్ల పోరాడుతున్న రాహుల్ గాంధీ తెలంగాణ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపేందుకు తెలంగాణ కు రావాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రతిపక్ష నాయకులుగా పోరాటం చేస్తుంటే రేవంత్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అంచివేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హోంశాఖ, విద్యాశాఖ రెండు శాఖలు ముఖ్యమంత్రి ఆధీనంలో ఉంచుకొని బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాడని ఆయన విమర్శించారు. హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు, భౌతిక దాడులు నిర్వహిస్తున్నారని ముఖ్యమంత్రి ఒక పెద్ద క్రిమినల్ గా మారారని ఆయన ఎద్దేవా వేశారు. ఇలాంటి అక్రమ అరెస్టులు జరుగుతుంటే రాష్ట్ర డీజీపీ ఏం చేస్తున్నాడని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతులకు సాగునీరు అందించడంలో ముఖ్యమంత్రి విఫలం కావడం, లగీచర్ల రైతులకు బేడీలు, రిటైర్డ్ ఉద్యోగులకు వచ్చే బెనిఫిట్స్ ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు ఇవన్నీ నీరు కారిపోయాయని ఆయన విమర్శించారు. జీవో 97 వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందనే నెపంతోనే వరంగల్ పాలిటెక్నిక్ నుండి పదిమంది విద్యార్థులు టీసీలు తీసుకొని వెళ్లిపోయారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుకు తక్షణమే జీవో 97 రద్దు రద్దుచేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడవలసిన బాధ్యత ముఖ్యమంత్రి పై ఎంతైనా ఉందని హరీష్ రావు హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, తాటికొండ రాజయ్య ,సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మా రెడ్డి,నాగూర్ల వెంకటేశ్వరరావు, వాసుదేవ రెడ్డి, రాకేష్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేరాల, ప్రమాదాల అదుపుకు పకడ్బందీ ప్రణాళిక

**ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు వాహనాలు బ్రేక్ డౌన్ అయితే 112 కు కాల్ చేయాలి డి.ఎస్.పి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో తనిఖీ నిర్వహించిన ఎస్పి నర్సింహ**

కోదాడ, (సింగిడి): పలు రకాల నేరాలు, రహ దారులపై ప్రమాదాల అదుపుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎస్పీ నర్సింహ స్పష్టం చేశారు. గురువారం కోదాడ డి.ఎస్.పి కార్యాలయం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో తనిఖీ నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.. పెరుగుతున్న జన సమర్థంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందువల్ల ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల భద్రత కు సముచిత ప్రాధాన్యత ఇస్తున్నామని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామ న్నారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు, సామాజిక అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించి చైతన్యం తెచ్చేందుకు పోలీసు యంత్రాంగం సమాయత్తమవు తుందన్నారు. రహదారులపై వాహనాలు బ్రేక్ డౌన్ అయినట్లయితే వెంటనే 112 కు డయల్ చేయాలని ఆయన వాహనదారులకు ప్రయాణికులకు సూచించారు. ప్రజల భద్రతలో అనుక్షణం అప్రమత్తతతో ఉండాలని పోలీసులకు సూచించారు. సాంకేతికతను అవగతం చేసుకొని స్మార్ట్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. డివిజన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లో పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని




డి.ఎస్.పి కి సూచించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ తనిఖీ నిర్వహణలో డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి, సిఐలు శివశంకర్ నాయక్ చరమందరాజు రామకృష్ణారెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి ఎస్సైలు నవీన్ మోహన్ ఆర్ఎస్ఐ అఖిల్ పాల్గొన్నారు.



# ఓనం వేళ.. తారల తళతళ

ఇంటి నిండా పూల తోరణాలు, పిండి వంటల ఘుమఘుమలు, సంప్రదాయ దుస్తులు.. ఇలా కేరళ అంతా ఓనం పండగతో కళకళలాడుతున్న సమయమిది. మలయాళీలు ఎంతో వైభవంగా చేసుకునే వేడుకనే ఓనం. అయితే ఈసారి ఈ పండగకి మరింత వన్నె తెచ్చారు మన అందాల నాయికలు. సినిమాల చిత్రీకరణలతో బిజీ బిజీగా గడిపే పలువురు సినీతారలు సంప్రదాయ చీరకట్టులో తళతళ మెరుస్తూ... సామాజిక మాధ్యమాల్లో వాటికి సంబంధించిన ఫొటోలను పంచుకొని సినీప్రియులకు శుభాకాంక్షలు తెలిపారు.









## సన్నీ లియోన్‌కు ఊరట..

### ఆ కేసును కొట్టేసిన కోర్టు

బాలీవుడ్ నటి సన్నీ లియోన్‌కు తాజాగా భారీ ఊరట లభించింది. సన్నీ లియోన్, ఆమె భర్త డేనియల్‌పై నమోదైన ఛీటింగ్ కేసును బాంబే హై కోర్టు కొట్టేసింది. తెలుగు సినిమా విషయంలో రూ. 70 లక్షలకు పైగా కమీషన్ బకాయి పెట్టారంటూ ఓం ప్రకాశ్ జైన్ చేసిన ఆరోపణలపై ఈ పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంలో మోసం, నమ్మకద్రోహం, క్రిమినల్ బెదిరింపులకు పాల్పడ్డారంటూ జైన్ పేర్కొన్న ఫిర్యాదును 2024లో మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. అయితే.. ఈ వ్యవహారం వాణిజ్య లావాదేవీకి సంబంధించినదేనని అదనపు సెషన్స్ జడ్జి పి.ఏ.సానే తెలిపారు. కేవలం చెల్లింపులు జరగకపోవడం వల్లే మోసం లేదా నమ్మకద్రోహం నేరాలు నిర్ధారించలేమని స్పష్టం చేసింది. మొదటి నుంచే మోసం చేసినట్లు ఆధారాలు ఉంటేనే వాణిజ్య వివాదం, క్రిమినల్ నేరంగా పరిగణించవచ్చని పేర్కొంటూ జైన్ రివిజన్ పిటిషన్‌ను కొట్టేసింది.



## కామెడీకి కొదవలేదు.. హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చేది వీరే

తెలుగులో మంచి క్రేజ్ కలిగిన రియాలిటీ షోలలో బిగ్ బాస్ ముందు వరుసలో ఉంటుంది. తొలుత ఇండియాలో హిందీలో ప్రారంభమైన ఈ రియాలిటీ షోను ఆ తర్వాత అనేక ప్రాంతీయ భాషల్లోనూ ప్రారంభించారు. అందులో భాగంగా తెలుగులో కూడా ఈ షో ప్రారంభమై చాలా సంవత్సరాలు అవుతోంది. తెలుగులో బుల్లితెరపై తొమ్మిది సీజన్లు, ఓటీటీ వేదికపై ఒక సీజన్ పూర్తయ్యాయి. మరికొన్ని రోజుల్లో పదో సీజన్ కూడా గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. ఈసారి మొత్తం 14 మంది హౌస్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది.

ఇందులో 9 మంది సెలబ్రిటీలు, ఐదుగురు సాధారణ వ్యక్తులు ఉండబోతున్నట్లు సమాచారం. ఐదుగురు కామన్ మ్యాన్‌లను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం 'అగ్ని పరీక్ష' నిర్వహిస్తున్నారు. ఈ వారంలో హౌస్‌లోకి వెళ్లే ఆ ఐదుగురు కామన్ కంటెస్టెంట్లు ఎవరు అనేది క్లారిటీ వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈసారి బిగ్ బాస్ హౌస్‌లో గ్లామర్, కామెడీకి కొదవ లేకుండా ఉండాలనే ఉద్దేశంతో బిగ్ బాస్ బృందం కంటెస్టెంట్లను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. తన అందాలతో ఆకట్టుకుంటున్న యాంకర్ కమ్ నటి వర్షిణి ఈ సీజన్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

అలాగే క్రేజీ నటి చైత్ర రాయ్ కూడా ఇప్పటికే బిగ్ బాస్ హౌస్‌లోకి ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయినట్లు సమాచారం. ఈ ఇద్దరు ముద్దుగుమ్మలతో పాటు ప్రస్తుతం సీరియల్స్‌తో ఫుల్ బిజీగా కెరీర్‌ను కొనసాగిస్తున్న నటి దేబ్జానీ మోదక్ కూడా బిగ్ బాస్‌లో పార్టిసిపేట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు తమ కామెడీతో ప్రేక్షకులను అద్భుతంగా నవ్వించిన రామ్ ప్రసాద్, పొట్టి నరేష్ కూడా హౌస్‌లోకి వెళ్లబోతున్నట్లు సమాచారం. ఇలా వీరితో ఈసారి బిగ్ బాస్ హౌస్‌ను గ్లామర్ ప్లస్ కామెడీతో నింపేయాలని బిగ్ బాస్ బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక వీరితో పాటు హీరో త్రిగుణ్, కృష్ణుడు, ముఖేష్ గౌడ, టెంపర్ వంశీ కూడా బిగ్ బాస్ హౌస్‌లోకి వెళ్లనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# ఈసారి బిగ్ బాస్‌లో గ్లామర్..

సినిమా సింగిడి
Cinma Singidi

శుక్రవారం
28-8-2026

## ప్రముఖ నటుడు నారాయణ కన్నుమూత



ప్రముఖ నటుడు జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయమైన ఆయన.. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు.. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు.

కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విద్యాబ్యాసం గుంతకల్లులో సాగింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్.కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బీన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర తదితర నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల తదితరులు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి.సీరియళ్లలోనూ నారాయణ రావు నటించారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737